RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 17 జూలై 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:42

# పూరీ జగన్నాథుడి రథయాత్రలో అపశ్రుతి... ఒకరి మృతి

**పూరీ జగన్నాథ రథయాత్రలో బారికేడ్ కూలిపోయి ఒకరిపై ఒకరు పడిపోయిన భక్తులు**

**ఊపిరాడక ఒక భక్తుడు మరణించినట్లు సమాచారం**

**భారీ రద్దీ, వర్షం కారణంగా పలువురికి గాయాలు**

**దాదాపు 200 మంది అస్వస్థతతో ఆసుపత్రిలో చేరినట్లు వార్తలు**

**మరణాన్ని ఇంకా అధికారికంగా ధ్రువీకరించని అధికారులు**

ఒడిశాలోని పూరీలో గురువారం జరిగిన జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ కారణంగా ఏర్పడిన తొక్కిసలాట లాంటి పరిస్థితుల్లో ఊపిరాడక ఒకరు మరణించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, పూరీలోని మారిచికుండ్ కూడలి వద్ద ఈ దుర్ఘటన జరిగింది. భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన తాళ్ల బారికేడ్ కూలిపోవడం లేదా కొందరు భక్తులు పట్టుతప్పి కింద పడిపోవడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. సుమారు 40 నుంచి 50 మంది ఒకేచోట పడిపోవడంతో పలువురు గాయపడ్డారు. వారిలో నలుగురైదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంటనే స్పందించి సుమారు 20 మందిని రక్షించి అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఒక వృద్ధుడు మరణించినట్లు తెలిసిందని వారు పేర్కొన్నారు.భారీ జనసందోహం, కుండపోత వర్షం కారణంగా ఊపిరాడక, ఇతర గాయాలతో సుమారు 200 మంది భక్తులు పూరీలోని ఆసుపత్రులలో, తాత్కాలిక వైద్య శిబిరాల్లో చేరినట్లు సమాచారం. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు, గురువారం



ఉదయం షెడ్యూల్ కంటే ముందుగానే పహండీ బిజే క్రతువుతో రథయాత్ర ప్రారంభమైంది. అయితే, ఊరేగింపు పూర్తికావడానికి మాత్రం రెండు గంటలకు పైగా ఆలస్యమైంది.

# క్రీడా రంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. క్రీడల్లో రాణించిన వారికి క్యాష్ రివార్డులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

ఇటీవల విజయవంతంగా జరిగిన సీజన్-1 క్రీడలకు సంబంధించి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణకు ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని, స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గతంలో







టీజీ-20 క్రికెట్ లీగ్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టు ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులను అభినందించిన ముఖ్యమంత్రి వారికి చెక్కులను అందజేశారు. జాతీయ స్థాయి క్రీడలకు హైదరాబాద్ వేదికగా నిలిచిందని గుర్తుచేశారు.

గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునేందుకు టీజీ20 ఒక మంచి అవకాశంగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. టీజీ20లో విజయం సాధించిన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టు సభ్యులందరినీ అభినందిస్తూ, భవిష్యత్తులో దేశ ప్రతిష్ఠను పెంచే క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఏ రంగంలోనైనా రాణించాలంటే ఫోకస్ అవసరమని, ఎంచుకున్న రంగంపై గౌరవం, ఆసక్తి ఉండాలని క్రీడాకారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈనాడు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్ , ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ పాల్గొన్నారు.

# గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది.

మిగతా 2లో

# ఆగస్టు 15లోగా విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు: సీఎం రేవంత్

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలోని 27.50 లక్షల మంది విద్యార్థులకు ఆగస్టు 15లోగా తొమ్మిది రకాల వస్తువులతో కూడిన ఎడ్యుకేషన్ కిట్లను అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో జడ్పీ గర్ల్స్ హైస్కూల్ కొత్త భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విదేశాల్లో విద్యా ప్రమాణాలను అధ్యయనం చేసేందుకు 50 మంది టీచర్లను విదేశాలకు పంపామని, ఈసారి మరో 150 మందిని సింగపూర్, సౌత్ కొరియా, ఫిన్లాండ్ దేశాలకు పంపుతున్నట్టు చెప్పారు.

# మేడారం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి సీతక్క





**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 16**గురువారం తాడ్వాయి మండలం మేడారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, మేడారంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.తదుపరి మేడారం ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, మేడారం హరిత హోటల్‌లో మేడారం అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిగతా 10లో

# ఎటువంటి బేషజాలు లేకుండా సీతారామ పనులు పూర్తి చేస్తాం

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై16 ప్రజాబలం:**సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... తమ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ పనులను వేగవంతం చేస్తోందని తెలిపారు. డిజైన్ల మార్పుల పేరుతో కాలయాపన చేసే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. ఈ కరువు కాలంలో కూడా ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేసి రైతులకు అండగా నిలిచామని ఆయన వివరించారు.

అనంతరం ఈ సమీక్షలో సీతారామ భూసేకరణ పనుల కోసం వెంటనే 135 కోట్ల రూపాయలను విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన బిల్లులు సిద్ధం చేసి వెంటనే టోకెన్లు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. పనుల వేగాన్ని బట్టి ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు దివాకర టిఎస్, అంకిత్, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాబలం

17 జూలై 2026 శుక్రవారం

# అమెరికా యూ టర్న్..

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలనే ప్రతిపాదనలను అమెరికా కాస్త వెనక్కి తగ్గింది. ఇది భారత్, చైనాకు ఊరట కలిగించే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాలో ప్రవేశపెట్టిన రష్యా ఆంక్షల బిల్లును సవరించారు. ప్రతిపాదిత గరిష్ట సుంకాన్ని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఈ బిల్లు చట్టంగా మారితే, భారత్ వంటి ప్రధాన రష్యన్ చమురు దిగుమతిదారులకు మేలు జరగనుంది. ఇప్పటి వరకు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలగవచ్చు. రిపబ్లికన్– డెమోక్రటిక్ చట్టసభ సభ్యులు మంగళవారం రష్యా ఆంక్షల బిల్లు సవరించిన ప్రతిని ప్రవేశపెట్టారు. ఈ కొత్త ముసాయిదా, రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై గరిష్టంగా 100 శాతం సుంకాన్ని విధించాలని ప్రతిపాదిస్తోంది. గతంలో, ఈ బిల్లు అటువంటి అన్ని దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలని కోరింది. అగ్రరాజ్యం అమెరికాకు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక భారత్‌కు మొదలైన కష్టాలు ఇంకా కొనసాగుతున్నాయి. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో భారత్ ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొటోంది. అమెరికా వెళ్లేవారు ఇబ్బంది పడుతన్నారు. ఇక ప్రతీకార సుంకాలు భారత వ్యాపార ఎగుమతులను దెబ్బతీస్తున్నాయి. ఇప్పటికే అనేక కారణాలతో దిగుబతులపై 25 శాతం నుంచి 50 శాతం వరకు సుంకాలు అమలు అవుతున్నాయి. తాజాగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపి ట్రంప్ చట్ట సవరణ తీసుకురాబోతున్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసే దేశాలపై విధించాలనుకున్న సుంకాల గరిష్ట పరిమితిని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించారు. ఈ బిల్లు రష్యా నాయకులు, ఆర్థిక సంస్థలు, ఇంధన సంబంధిత ప్రాజెక్టులను నేరుగా లక్ష్యంగా చేసుకుంటుంది. ఈ చట్టం (శాంక్షనింగ్ రష్యా యాక్ట్)ను ఇటీవల మరణించిన సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించారు. దీని ద్వారా అధ్యక్షుడికి రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం లభిస్తుంది. మొదట్లో దీనిని ఆర్థికంగా బలహీనపరిచే శక్తివంతమైన చర్యగా అభివర్ణించారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో సుంకాల పరిమితిని 100 శాతానికి తగ్గించి సవరించారు. ఈ మార్పులకు ప్రభుత్వ, వ్యతిరేక పక్షాల నుంచి మద్దతు లభించింది. గ్రాహమ్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు యుద్ధానికి పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నాయని ఆరోపించారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఆ దేశాలు రష్యా ఇంధనం కొనకుండా అడ్డుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. సవరించిన రూపంలో ఈ నిబంధనలు మిత్రరాజ్యాలకు అనుకూలంగా ఉన్నాయి. లక్ష్యంగా మారే దేశాల్లో చైనా, భారత్, స్లోవేకియా, హంగరీ, అజర్‌బైజాన్ ఉన్నాయి. రష్యా సహజ వాయువును దిగుమతి చేసుకునే ప్రధాన దేశాల్లో చైనా, ఫ్రాన్స్, జపాన్, హంగరీ, బెల్జియం ఉన్నాయి. రష్యా వాయువు ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసి, సరఫరాలను తగ్గించే చర్యలు తీసుకుంటున్న దేశాలకు ఈ బిల్లులో మినహాయింపులు ఇచ్చారు. ఇది జపాన్, ఫ్రాన్స్‌కు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. మధ్యప్రాచ్యంలో సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు అమెరికా రష్యా ఇంధనంపై మినహాయింపులు ఇచ్చింది. ప్రస్తుతం ఆ మినహాయింపులను తొలగించే యోచనలో ఉంది. ట్రంప్ పిచ్చి చేష్టలతో మళ్లీ చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది. రష్యా నుంచి ముడి చమురును అత్యధికంగా కొనుగోలు చేసే దేశాల్లో భారత్, చైనా ఉన్నాయని అమెరికా భావిస్తోంది. సవరించిన బిల్లు ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాలకు మాత్రమే గరిష్ట సుంకాలు వర్తిస్తాయి. గతంలో, ఈ నిబంధన దిగుమతి చేసుకునే అన్ని దేశాలకు వర్తించేది. ఈ బిల్లును దివంగత రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం, డెమోక్రటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతల్ ప్రవేశపెట్టారు. సవరించిన ఈ బిల్లుకు రిపబ్లికన్,డెమోక్రటిక్ పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. సెనేట్ వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుతం 26 మంది చట్టసభ్యులు ఈ బిల్లుకు సహ-ప్రాయోజకులుగా ఉన్నారు. ఇది కాంగ్రెస్‌లో ముందుకు సాగే కొద్దీ మరింత మద్దతు పొందే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదన ప్రస్తుతం అమెరికా కాంగ్రెస్‌లో పరిశీలనలో ఉంది. కాంగ్రెస్ ఆమోదం, అధ్యక్షుడి అంగీకారం లభించిన తర్వాతే ఇది చట్టంగా మారుతుంది.

# గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

## అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

## ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

## భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు

మొదటి పేజీ తరువాయి



ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

# అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలి: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

## గోల్కొండ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న గవర్నర్

హైదరాబాద్, జులై 16, 2026: తెలంగాణ ఆధ్యాత్మిక వైభవానికి, సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ రాష్ట్ర ప్రజల ఐక్యత, భక్తి, సంప్రదాయాల సజీవ ప్రతిబింబమని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.

భాగ్యనగర్ బోనాలు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం చారిత్రక గోల్కొండ కోటలో నిర్వహించిన గోల్కొండ బోనాల మహోత్సవంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పాల్గొన్నారు. ఉత్సవ సమితి వేదిక పై జగదాంబిక మహంకాళి అమ్మ వారికి నిర్వహించిన పూజ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గవర్నర్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. బోనాలు కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రజల భక్తి, మాతృశక్తి ఆరాధన, సనాతన సంస్కృతికి చిరస్థాయి చిహ్నమని పేర్కొన్నారు.

ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించే సంప్రదాయం ప్రకృతితో మమేకమైన భారతీయ జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుందని గవర్నర్ అన్నారు. పసుపు, వేప, పూల వినియోగం మన పూర్వీకుల శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రకృతి పట్ల ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుందని చెప్పారు. ఘటం, పోతరాజు, రంగం వంటి సంప్రదాయాలు తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి అపూర్వమైన గుర్తింపుగా నిలిచాయని పేర్కొన్నారు.

బోనాల పండుగ సందర్భంగా ప్రజలు మంచి వర్షాలు కురిసి, వ్యవసాయం సమృద్ధిగా సాగాలని ప్రార్థించడం భారతీయ సంస్కృతిలో ప్రకృతి పట్ల ఉన్న కృతజ్ఞతా భావానికి నిదర్శనమని గవర్నర్ అన్నారు. "వసుధైవ కుటుంబకం", "సర్వేజన సుఖినో భవంతు " అనే భారతీయ విలువలను ఈ పండుగ మరింత బలంగా చాటిచెబుతోందని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం, దేశం, ప్రపంచం సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని అమ్మ మహంకాళిని ప్రార్థిస్తున్నానని గవర్నర్ తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ మహోత్సవాన్ని భక్తి, క్రమశిక్షణ, సామరస్య వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి కె శశికిరణా చారి , భాగ్యనగర్ బోనాలు ఉత్సవ సమితి అధ్యక్షులు డా. భగవంత్ రావు, గోల్కొండ జగదాంబిక ఆలయ అభివృద్ధి సమితి ప్రధాన సలహాదారు శ్రీ రాజు ఉస్తాద్, , భాగ్యనగర్ బోనాలు ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ రాహుల్ స్వాగత్, గోల్కొండ జగదాంబిక ఉత్సవ సమితి అధ్యక్షుడలు శ్రీ అకుల చంద్రశేఖర్, , ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలే మహిళల ఆర్థిక సాధికారతకు పునాది


## మంత్రి దనసరి అనసూయ సీతక్క





**వాజేడు డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 16 ములుగు** గురువారం వాజేడు మండలం చీకుపల్లి గ్రామంలోని బోగత జలపాతం వద్ద ఇందిరా మహిళాశక్తి జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, భద్రాచలం శాసనసభ సభ్యులు ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, మహిళా సంఘాలకు అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగాలని సూచించారు. కుట్టు శిక్షణ, యూనిఫారాల తయారీ వంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని, వాజేడు, జగన్నాథపురం, పేరూర్ ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు హాస్టళ్లు, పాఠశాలల యూనిఫారాల కుట్టు పనులను అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నామని, దీంతో మహిళలకు నిరంతర ఆదాయం లభించే అవకాశం ఉంటుందన్నారు. బోగత జలపాతం వంటి పర్యాటక ప్రాంతాల్లో మహిళా సంఘాలు క్యాంటీన్లు, చిరు వ్యాపారాలు, స్థానిక ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు నిర్వహించడం ద్వారా మంచి ఆదాయం ఉంది అవకాశం ఉందన్నారు. ప్రతి మహిళ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. వడ్డీ లేని రుణాలతో పాటు కొనుగోలు కేంద్రాల నిర్వహణ, జీవనోపాధి కార్యక్రమాల్లో మహిళా సంఘాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది గతం కంటే ఎక్కువ కొనుగోలు కేంద్రాల బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామని, భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు డిఆర్డిఏ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో రోడ్డు భద్రతకు కొత్త బ్యూరో ఏర్పాటు: డిజిపి వి ఆనంద్




హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో' ఏర్పాటుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. బ్యూరో ఏర్పాటు, విధులు, సిబ్బంది, చేపట్టాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. దీనికి సంబంధించిన చట్టపరమైన అంశాలు, పరిపాలనా విధానాలపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డీజీపీ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర రాష్ట్రాల విధానాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వ నిబంధనలపై చర్చించారు.

# సంతోషం అనేది ఎవరో ఇచ్చేది కాదు, దాన్ని మీరే సృష్టించుకోవాలి



వికారాబాద్ జులై16 : ఇల్లు కట్టేటప్పుడు దేవుడి కోసం ప్రత్యేకంగా పూజా గదిని కేటాయిస్తాం...కాని మనకు జన్మనిచ్చి, పెంచి, నిలబెట్టిన తల్లిదండ్రులకు మాత్రం ఇంట్లో చోటు లేక వృద్ధాశ్రమం వైపు దారి చూపిస్తున్నారని దేవున్ని పూజించడం గొప్పే... కాని దేవుళ్లలాంటి తల్లిదండ్రులను గౌరవించడం అంతకంటే గొప్ప ధర్మం అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. నేడు డే కేర్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో సాయి చౌదరి మాట్లాడుతూ, వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలిపోకుండా, ఎవరికీ భారం కాకుండా ఉండాలంటే ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం తొందరపడకండి అని పిల్లలు ఇప్పుడు "దేవుళ్ళలా" కనిపించినప్పటికీ, ఆస్తులను చివరి పైసా వరకు రిజిస్టర్ చేసిన తర్వాత, మీరు ఆ ఇంట్లో "అక్కర్లేని వస్తువు"గా మారవచ్చు, పిల్లలు చెడ్డవారు కాదు, కానీ ప్రపంచం క్రూరమైనది. ప్రతిదీ మీ చేతుల్లోనే ఉంచుకుని జీవించండి అని సాయి చౌదరి అన్నారు. మీ 30 ఏళ్ల పెన్షన్ను మీ పిల్లల చదువుల కోసం ఇచ్చేయకండి. చివరికి, మందులు కొనడానికి మీరు ఆ పిల్లలపైనే ఆధారపడవలసి రావచ్చు. కాబట్టి మీ చివరి పొదుపును కాపాడుకోండి అని, "వాళ్ళు మన పిల్లలు" అని చెబుతూ వారి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోకండి. మీరు వారికి మరీ దగ్గరైతే, మీ ప్రేమ వారికి ఒక "ఇబ్బంది"గా మారుతుంది. నిద్రకు మించిన ఔషధం లేదు అని అనవసరమైన నిద్రలేమిని తగ్గించుకుని ప్రశాంతంగా నిద్రపోండి. మీరు అనారోగ్యంతో ఉన్నప్పుడు, మీ బాధను ఎవరూ పంచుకోరు, మీరు దానిని ఒంటరిగానే అనుభవించాలి. ఎవరో ఒకరు ఏదైనా చేస్తారనే అంచనాను తగ్గించుకోవడం అలవాటు చేసుకోండి. మీ నీడ కూడా మిమ్మల్ని విడిచిపెట్టే రోజు వస్తుంది. మరణించడం కూడా ఒంటరితనమే, కాబట్టి ఒంటరిగా సంతోషంగా ఉండటం నేర్చుకోండి. సంతోషం అనేది ఎవరో ఇచ్చేది కాదు, దాన్ని మీరే సృష్టించుకోవాలి! అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు.

# చాంద్రాయణగుట్ట శివాజీ నగర్ బస్తి లో 8 లక్షల వ్యయంతోని సిసిరోడ్డుపనులుప్రారంభం





హైద్రాబాద్ జులై 16; తెలంగాణ రాష్ట్ర వాల్మీకి వాల్మీకి బోయ వైస్ చైర్మన్ బోయ నగేష్ ఆధ్వర్యంలో గురువారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో పూల్ బాగ్, శివాజీ నగర్ బస్తి లో 8 లక్షలవ్యయంతోని జజ రోడ్డు పనులను ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకొని ఈ యొక్క ప్రాంతంలో బస్తీ వాసులందరూ కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జిమంత్రివర్యులు , పొన్నం ప్రభాకర్ కిబోయ నగేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో బస్తివాసులు, కుమార్, బాలు, రాములు,బన్నీ, కుశల్, మరియు బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తుర్కపల్లిలో నకిలీ కరెన్సీ ముగ్గురు మోసగాళ్లు అరెస్ట్



యాదాద్రి భువనగిరి జులై 16:పదివేల నగదు రెండు మోటార్ సైకిళ్ళు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం పిల్లల ఆట కరెన్సీ నోట్లతో రూ.1 లక్షకు రూ.2 లక్షలు ఇస్తామని మోసం యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల చాకచక్యంతో కేసు ఛేదన సులభంగా డబ్బు వస్తుందంటే మోసపోవద్దు

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 15 సూర్య న్యూస్ పిల్లలు ఆడుకునే కరెన్సీ నోట్లతో లక్షకు రెండు లక్షలు ఇస్తామని మోసం చేసిన ముగ్గురు నిందితులను యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల నుండి పదివేల రూపాయల నగదు, రెండు మోటర్ సైకిళ్లు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్స్

యాదవ్ ఆదేశాలు, పర్యవేక్షణలో తుర్కపల్లి పోలీసులు వేగంగా స్పందించి, పిల్లల ఆట కరెన్సీ నోట్లను ఉపయోగించి అమాయక ప్రజలను మోసం చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి నేరానికి సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. తుర్కపల్లికి మండలానికి చెందిన ఒక వ్యక్తిని నిందితులు సంప్రదించి, రూ.1,00,000 ఇస్తే రూ.2,00,000 నగదు ఇస్తామని ఆశ చూపి నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు పల్లెపహాడ్ స్టేజ్ సమీపంలో రూ.1,00,000 నగదును వారికి అప్పగించారు. అనంతరం నిందితులు ఇచ్చిన కరెన్సీ కట్టలను పరిశీలించగా, పైన, కింద మాత్రమే అసలైన రూ.500 నోట్లు ఉంచి, మధ్యలో చిల్డ్రన్స్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పెషమెన్ అని ముద్రించిన పిల్లల ఆట కరెన్సీ నోట్లను ఉంచి మోసం చేసినట్లు గుర్తించాడని తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తుర్కపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలు, సమాచారాన్ని, సేకరించి బుధవారం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో భువనగిరికి చెందిన ముదురుకోల యాకంబరం (29), ముదురుకోల దేవేందర్ (38) హయత్ నగర్ కుంట్లూరు కు చెందిన మద్దిబోయిన నాగరాజు (34)ను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి పిల్లల ఆట కరెన్సీ నోట్ల 16 కట్టలు. రూ.10,000 నగదు. ఒక హీరో హోండా ప్యాషన్ మోటార్ సైకిల్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

విచారణలో ప్రధాన నిందితుడు ముదురుకోల యాకంబరం గతంలో సుబేదారి, నర్సంపేటు పోలీస్ స్టేషన్లలో నమోదైన నకిలీ కరెన్సీ కేసుల్లో నిందితుడిగా ఉండి, ఆ కేసుల్లో ఆరెస్సై జ్యుడీషియల్ రిమాండ్కు వెళ్లినట్లు, ఇటీవల జైలు నుంచి విడుదలై మళ్లీ ఇదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాన్స్ యాదవ్ ప్రజలకు సూచిస్తూ, సులభంగా అధిక డబ్బు వస్తుందనే ఆశతో ఎవరైనా వేసే అఫర్లను, కరెన్సీ మార్పిడి పేరుతో జరిగే మోసాలను నమ్మవద్దని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఇటువంటి మోసాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కేసును జిల్లా ఎస్పీ లక్షాన్డ్ యాదవ్ పర్యవేక్షణలో, డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు. యాదగిరిగుట్ట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శంకర్ మార్గదర్శకత్వంలో, తుర్కపల్లి ఎసీ మహమ్మద్ తఖియుద్దీన్, పోలీసు సిబ్బంది విజయవంతంగా ఛేదించారు.

## బాసర సరస్వతి సన్నిధి లో అలరించిన అష్టావధానం



బాసర జులై 16; బాసర సరస్వతి సన్నిధి లో అలరించిన అష్టావధానం మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాలశ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపంలో గల శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ ము కోటి పార్థివశివలింగ శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగమందిర మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దీపారాధన, కలశ స్థాపన ,విఘ్నేశ్వరశ్వర పూజ ,కోటి పార్థివ లింగ , శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకం పుష్పార్చన , బిల్వార్చన , గోపూజ ,గణపతి, నవగ్రహ, రుద్రహోమములు, భూదాన సంకల్ప పూజ, మహా అన్నదానము నిర్వహించారు. .కవితా విద్వన్మణి ,అవధాన విభూషణ విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి అష్టావధానం చేశారు . పద్యకోకిల ,అభినవ చృళ్ళపిళ్ళ డా..ఓంప్రకాశ్ బోచ్కర్ సంచాలకులు గా,పృచ్ఛకులు గా ..ఆచార్య గొట్లూరి సురేశ్ బాబు(నిషిద్ధాక్షరి).,మైరోళ్ళ అశోక్ గౌడు (సమస్య) ,వల్లంభట్ల వనజ ( దత్తపది).,డా.భోగయ చంద్రశేఖర్ శర్మ (వర్ణన) ,గణపురం రాజేదర్ (ఆశువు )పేరంసంధ్యారాణి (న్యస్తాక్షరి)దుర్గి శ్రవణ్ కుమార్ శర్మ (ఛందోభాషణం) డాక్టర్ వెంకన్న జ్యోతి (అప్రస్తుత ప్రసంగం) పృ చ్ఛకులుగా పాల్గొన్నారు.

# కీ.శే. తుంపాల వీరాచార్యులు శత జయంతి



హైద్రాబాద్ జులై 16; కీ. శే. తుంపాల వీరాచార్యులు (విశ్రాంత తహసిల్దార్) శత జయంతి మహోత్సవం సందర్భంగా మరియు తల్లిగారు కీ. శే. సత్యవతి జ్ఞాపకార్థం, వారి మీద తమకు ఉన్న ప్రేమ అభిమానాలు మరియు గౌరవంతో హైదరాబాద్ బేగంపేట్ లో ఉన్న దేవనార్ స్కూల్ ఆఫ్ బ్లైండ్ లో ఆశ్రయం పొందుతున్న 450 మంది విద్యార్థులకు అన్నదానం చేసినట్లు పారిశ్రామికవేత్త, విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్ మరియు విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ సేవా సంస్థల అధ్యక్షులు డాక్టర్ తుంపాల వెంకటేశ్వరరావు తెలియజేశారు.

ఈ సేవ కార్యక్రమాన్ని తమసోదరులుతుంపల గున్నేశ్వరరావు, అప్పారావు, ఈశ్వరరావు, శివప్రసాద్, సోదరీమణులు నాగులకొండ నాగలక్ష్మి, చేబోలు కుసుమకుమారి, కోడళ్ల రామలక్ష్మి, అన్నపూర్ణ సుశీల విజయ, పద్మావతి, అల్లుళ్ళు నాగులకొండ అశోక్ బాబు, చేబోలు హరినాధ శాస్త్రి సంయుక్తంగా నిర్వహించినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

## కాంగ్రెస్ మార్క్ 'ఎడ్యుకేషన్ జిహాద్' పై సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఫైర్.



హైద్రాబాద్ జులై 16: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందని, హైదరాబాద్ ఓల్డ్ సిటీ పరిధిలోని సైదాబాద్లోని సక్సెస్ స్కూల్లో జరిగిన ఘటన దీనికి ప్రత్యక్ష నిదర్శనమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థిని చేత కల్మా చదివించి, హోం వర్క్‌గా కల్మా మరియు 'సూరాఅల్-ఫాతిహా'లను నేర్చుకుని, పుస్తకాల్లో రాసుకుని ఇంటికి తీసుకువెళ్లాలని పాఠశాల యాజమాన్యం ఆదేశించడం అత్యంత ఆందోళనకరమని ఆయన ఖండించారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డియే పూర్తి బాధ్యత వహించాలని, "కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్" అంటూ ఆయన చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు.

తన రెండవ తరగతి బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, ధైర్యంగా పాఠశాల యాజమాన్యాన్ని నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మరియు విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠినమైన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యత నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణని, హిందూ విద్యార్థులు మరియు వారి కుటుంబాల భద్రత, ఆత్మగౌరవంపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కళ్ళు మూసుకుని వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు.

హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు, కల్మాలు బలవంతంగా రుద్దడం ఏమాత్రం సహించబోమని, కొన్ని కాన్వెంట్ స్కూళ్లలో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రాకూడదని ఒత్తిడి చేస్తూ మతాచారాలకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. విద్యా సంస్థలు విద్యను అందించాలి తప్ప, విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దే హక్కు ఎవరికీ లేదని, ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కును గౌరవించాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉందన్నారు. ఈ 'ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షికమైన, సమగ్రమైన దర్యాప్తు జరిపి, పాఠశాల యాజమాన్యంతో పాటు ఈ ఘటనకు కారకులైన ప్రతి ఒక్కరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

## నల్లమల్లో వజ్రాల వేట

కర్నూలు, జూలై 16,నంద్యాల – ఒంగోలు జాతీయ రహదారి పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రవాగులో వజ్రాల వేట మొదలైంది. పెద్దగా వర్షాలు కురవకపోయినా.. గతంలో కురిసిన వర్షాలకు అటవీ ప్రాంతం నుంచి నీరు వచ్చింది. దాంతో అడవిలోని వజ్రాలు వాగుతో సహా కొట్టుకొచ్చి ఉంటాయనే కారణంతో స్థానికులు వజ్రాల అన్వేషణ మొదలుపెట్టారు. నీటి అడుగు భాగంలో వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు. కడప, కర్నూలు, మార్కాపురం జిల్లా ప్రజలు ఎక్కువగా అన్వేషిస్తున్నారు.నల్లమల అటవీ ప్రాంతం మరోసారి ఆశావాహులతో కిటికిటలాడుతోంది. వర్షాకాలం మొదలైందంటే నల్లమల ప్రాంతమంతా వజ్రాల వేటే. ప్రతి ఒక్కరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతుంటారు. కొంతమంది అయితే నెలల తరబడి ఇదే ప్రాంతంలో ఉంటూ వజ్రాల వేట కొనసాగిస్తారు. ముఖ్యంగా నంద్యాల ఒంగోలు ప్రధాన మార్గంలోని నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగు వైపే అందరూ ప్రయాణిస్తారు.నల్లమల అడవీలో ఉన్న ఎర్రవాగులో జోరుగా వజ్రాల వేట కొనసాగుతోంది. నంద్యాల, కర్నూలు, మార్కాపురం, కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోని గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు ఎర్రవాగుకు చేరుకుని వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. వాగు వెంట నీటిలో జల్లెడ పడుతున్నారు. ప్రతి ఏటా వాగులో నీరు ప్రవహించే సమయాల్లో వజ్రాల కోసం ఈ అన్వేషణ కొనసాగుతుంది.నెల రోజుల వ్యవధిలో ఇటీవల కురిసిన సాధారణ వర్షాలకు నల్లమలలో నీటి ప్రవాహం జరిగింది. దాంతో ప్రజలు వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. గత నెలలో కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం జొన్నగిరిలో కూడా వజ్రాల వేట మొదలుపెట్టారు. జొన్నగిరి ప్రాంతంలో పొలాలకు వెళ్లి మరీ అన్వేషణ కొనసాగిస్తున్నారు. చిన్న వజ్రం దొరికినా తమ రాత మారుతుందనే ఆశతో ప్రజలు జల్లెడ పడుతున్నారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం..
## 20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు
## 20వ వార్డులో ఉచిత వైద్య శిబిరం..



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 16 ప్రజాబలం:**వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్ ఐ కేర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వార్డుకు చెందిన ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రక్తపోటు, మధుమేహం, జ్వరం, దగ్గు, జలుబు తదితర సీజనల్ వ్యాధులపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించి, తగిన జాగ్రత్తలు సూచించారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపాటి అనారోగ్య లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని, స్వయంగా మందులు వాడకుండా నిపుణుల సలహా మేరకే చికిత్స తీసుకోవాలని అన్నారు.

ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి మందులు అందజేయడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా కీలకమని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ తమ వంతు కృషి కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్ ఐ కేర్ నిర్వాహకులు ఉండ్రు శ్యాంబాబు, వైద్య సిబ్బంది దుర్గా మల్లేశ్వరి, శ్రీలత, శృతి, సుగుణ, నవీనతో పాటు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి
## ఏఈఓ షేక్. నాగుల్ మీరా



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 16 ప్రజాబలం:**రైతులకు పంటలపై ఎల్ నినో ప్రభావంపై అవగాహన ఏఈఓ షేక్. నాగుల్ మీరా కల్పించారు. బుధ, గురువారం రోజులుగా గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా ఏఈఓ షేక్ నాగుల్ మేరా వర్షపాత ప్రభావం పై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గంధంసిరి గ్రామపంచాయతీ కార్యాలయం నందు అత్యవసర ప్రణాళిక ఎల్-నినో ప్రభావం గురించి వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల గురించి అవగాహన కల్పించారు, వరి విస్తీర్ణం తగ్గించి ఆరుతడి పంటలైనటువంటి మినము,కంది,పెసర, అపరాలు, మిల్లెట్స్ సాగు చేయాలని రైతులకు సూచించారు, మరియు ఫార్మ్ పౌండ్స్ నీటి కుంటల తీసుకోవాలని నీటి కుంటలు తీసుకోవడం వల్ల బోర్లు రీఛార్జ్ అయ్యి గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పెరిగి బావులలో నీళ్లు వస్తాయని తెలియజేశారు, భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని తెలియజేయడం జరిగింది ఉపాధి హామీ పథకం కింద ఈ నీటి కుంటలు 100% సబ్సిడీలో ఐదు ఎకరాల లోపు ఉండి కరువు పని జాబ్ కార్డు ఉన్న రైతులు అర్హులు అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రఫీ, రైతులు జవ్వాజి శీను, మల్లెల వెంకటరావు, వి గోవర్ధన్ రెడ్డి,గంద్ర వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బి.శ్రీకాంత్ ,పి.వెంకట్రావు , బాణాపురం సర్పంచ్ తేజావత్ సంధ్య నాయక్ , రైతులు
కోలేటి బాబు, కనపర్తి పూర్ణచంద్రరావు, కనపర్తి బ్రహ్మం, యర్రా ఉపేందర్ రావ్, వి.రాము,ఇస్మాయిల్ గుండు మోహనరావు,
తదితర గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం: జిల్లాలో 'బ్లాక్ స్పాట్ల' పరిశీలన



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 16( ప్రజాబలం ప్రతినిధి )**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రహదారి భద్రత కమిటీ సభ్యులు గురువారం జిల్లాలోని పలు ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీల్లో జిల్లా రవాణా అధికారి డి. శ్రీనివాస్, ఆర్ అండ్ బి డీఈ శాంతయ్య, వేములవాడ ఆర్ అండ్ బి డీఈ, ట్రాఫిక్ ఎస్ఐ ఎస్. రాజు, ఎస్ఐ జ్యోతి , ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.




ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు గానూ ఆయా ప్రాంతాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై ఆర్ అండ్ బి అధికారులకు కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు.గుర్తించిన ప్రాంతాలు – సూచించిన భద్రతా చర్యలు

శాతరాజ్‌పల్లి ఒ ఫజిల్ నగర్ (ఎస్-కర్వ్ టర్నింగ్స్): రంబుల్ స్ట్రిప్స్, రోడ్ సైన్స్, స్టడ్స్, స్పీడ్ లిమిట్ బోర్డులు , క్రాష్ బ్యారియర్లు.

వట్టెమ్మల, గూడెం ఎంట్రీ, గూడెం గ్రామ టర్నింగ్ రంబుల్ స్ట్రిప్స్, రోడ్ సైన్స్, రోడ్ స్టడ్స్ , క్రాష్ బ్యారియర్లు.

రామరెడ్డిపల్లి , తెల్లుమద్ది (వై-జంక్షన్లు) వై-జంక్షన్ హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, రోడ్ స్టడ్స్ , హైమాస్ట్ లైట్లు.


నామాపూర్ (టీ-జంక్షన్) టీ-జంక్షన్ హెచ్చరిక బోర్డు, రంబుల్ స్ట్రిప్స్, రోడ్ సైన్స్.

నేరెళ్ల (సిరిసిల్ల--సిద్ధిపేట ప్రధాన రహదారి) రంబుల్ స్ట్రిప్స్, రోడ్ సైన్స్.

బద్దినపల్లి చౌరస్తా అన్ని దిక్కుల నుంచి వచ్చే వాహనాల కోసం రంబుల్ స్ట్రిప్స్ , అవసరమైన రహదారి భద్రతా సూచికలు.

రహదారి ప్రమాదాలను అరికట్టేందుకు ఈ గుర్తించిన అన్ని బ్లాక్ స్పాట్లలో యుద్ధప్రాతిపదికన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని కమిటీ సభ్యులు సంబంధిత అధికారులను ఆదేశించారు.

## అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య




**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై 16:** వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయి నగర్‌లో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయి నగర్‌కు చెందిన బాలసాని హేమంత్ (24) గత నాలుగు సంవత్సరాలుగా ఆస్తమా, ఛాతీ నొప్పి సమస్యలతో బాధపడుతున్నాడు. అనారోగ్య సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన హేమంత్ బుధవారం రాత్రి సుమారు 9.20 గంటల సమయంలో తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, హేమంత్‌కు 18 రోజుల క్రితమే కుమారుడు జన్మించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృతుడి తండ్రి బాలసాని మల్లేశం గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, అనారోగ్య సమస్యలు లేదా మానసిక ఒత్తిడితో ఎవరూ ఒంటరిగా బాధపడవద్దని సూచించారు. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా వైద్య నిపుణులను సంప్రదించడం ద్వారా అవసరమైన సహాయం పొందవచ్చని, సమయానికి సహాయం తీసుకోవడం వల్ల ఇలాంటి విషాద ఘటనలను నివారించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

**ఆగస్టు 15 నుంచి ఒంటరి మహిళలకు నూతన పింఛన్ల మంజూరు**

**మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 16**ఏటూరు నాగారం ఐటిడిఏ కార్యాలయంలో గురువారం కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరు నాగారం ఏజెన్సీ మండలాలకు సంబంధించిన వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, దరఖాస్తుల స్థితిగతులపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.






ఈ సందర్భంగా శాఖల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ పథకాల పంపిణీ, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కార స్థితిగతులను సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకుని అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ఏజెన్సీ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల అవసరాలు, ప్రజల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహం అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల వారీగా పేదవారి జాబితాలను సిద్ధం చేసి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఆగస్టు 15వ తేదీ నుంచి ఒంటరి మహిళలకు నూతన పింఛన్లను అందించడం జరుగుతుందని, అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు మరణించినట్లయితే వారి పేర్లను వెంటనే జాబితా నుంచి తొలగించి పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు.

పలు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు అందుబాటులో లేని కారణంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేయకుండా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని కోరారు.

ఏజెన్సీ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రజలు గ్రామాల్లో ఉన్న సమయాల్లోనే వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఆరోగ్య సేవలు అందించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, భద్రతతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.

గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంట మార్పిడిపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు, నకిలీ పురుగుమందుల విక్రయాలను కట్టడి చేస్తూ యూరియా సరఫరా సక్రమంగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించడం హర్షణీయమైన విషయమని మంత్రి పేర్కొన్నారు.

మహిళా సంఘాల సభ్యులు స్థానికంగా లభించే వనరులను వినియోగించుకుని వినూత్న జీవనోపాధి అవకాశాలను సృష్టించుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు ఆర్డీవో కృష్ణవేణి, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచలింగాల్ లో కనికెళ్ల కాడికి వెళ్లి వరద పాశం పోసిన గ్రామ ప్రజలు



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 16 (ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగాల్ గ్రామంలో ఎండిన భూమిలో ఆరిపోతున్న మొక్కలను చూసి గుండె నిండా బాధతో ఆకాశం వైపు కన్నులెత్తి బాధతో విలపిస్తున్న రైతన్నలు సకాలంలో వర్షాలు లేక భూమిలో వేసిన విత్తనాలు సరిగ్గా మొలకెత్తక అటు ఇటు మొలిసిన పంటలతో ఏం చేయాలే నిస్సహాయ స్థితిలో కేవలం మన ఆధారం దేవుడేనని చెరువు గట్టున ఉన్న కనికల కాడికి వెళ్లి నీళ్లతో తడిపి బోనాలు ఎత్తుకొనినైవేద్యములు సమర్పించి ఇక మాపై కరుణించు దేవుడా అని దేవునికి చేతులెత్తి మక్కిన గ్రామ ప్రజలు గుండెల్లో ఉన్న బాధ దేవుడికి సమర్పించి ఈ నేలంతా తెల్లవారేసరికి తడిసి తడిసి భారీ వర్షం కురిసీ నేలపై నీళ్లు ప్రజల గుండెల్లో చిరుజల్లు లాంటి ఆనందం ఒప్పొంగేలా దేవుడు భారీ వర్షం కురిపించాలని పాటలతో వైద్యాలతో నైవేద్యాలు సమర్పించి శాంతి ప్రసన్నత



కార్యక్రమంలో దేవరాజ్, సుగుణాకర్, బాగ య్య, ప్రభాకర్, సల్మాన్, లక్ష్మయ్య, రాములు, రాజేష్, బాబు, గ్రామ పెద్దలు అమలు అక్కలు యువకులు రైతన్నలు ఎంతో ఆసక్తితో కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు

# ఇందిరమ్మ కాలనీలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు..

## విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించిన.. వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్..

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై16 ప్రజాబలం:**వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ఇందిరమ్మ కాలనీలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు వేగవంతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ బుధవారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి కాలనీలో విస్తృతంగా పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా ఇంటి పై నుంచి ప్రమాదకరంగా వెళ్తున్న విద్యుత్ వైర్ల తొలగింపు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణం, నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. కాలనీలో ఎన్ని కొత్త స్తంభాలు అవసరమవుతాయో, ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలనే విషయాలపై అధికారులు అంచనా (ఎస్టిమేట్) సిద్ధం చేశారు.

ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ కాలనీలో ప్రతి గల్లీకి విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు.

ఈ పరిశీలనలో విద్యుత్ శాఖ డీఈ రమేష్, ఏడీఈ కిరణ్, సబ్ ఇంజనీర్ నరేష్, లైన్ ఇన్స్పెక్టర్ జార్జ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో ఫుడ్ పాయిజన్ కలకలశీ

## రెస్టారెంట్‌లో బిర్యానీ తిని పలువురు యువకులకు అస్వస్థత



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 16 (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరోసారి ఫుడ్ పాయిజన్ ఘటన తీవ్ర కలకలం రేపింది. సిరిసిల్ల పట్టణంలోని 'బకాసుర రెస్టారెంట్'లో మండి బిర్యానీ తిన్న పలువురు యువకులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

ఆహారం తిన్న కొద్దిసేపటికే యువకులకు వరుసగా వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. బాధితుల్లో ఒకరి పరిస్థితి విషమించడంతో వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించారు. మిగిలిన యువకులకు స్థానిక ఆర్ఎంపీ వైద్యుని వద్ద ప్రాథమిక చికిత్స అందించారు. కలుషిత ఆహారం (ఫుడ్ పాయిజన్) తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు స్పష్టం చేశారు.

ప్రజల ఆందోళన -- అధికారుల తనిఖీలకు డిమాండ్ ఇటీవల జిల్లాలో వరుసగా ఇటువంటి ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగుచూస్తుండటంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతా ప్రమాణాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుచున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ హౌస్‌లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, ఇతర ఆహార వ్యాపార సంస్థలపై ఆహార భద్రతా అధికారి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఆహార నాణ్యత, పరిశుభ్రత, గడువు ముగిసిన ఆహార పదార్థాల విక్రయం, నకిలీ , కల్తీ ఆహార పదార్థాల వినియోగం, అలాగే ప్రభుత్వ నిబంధనల అమలును క్షుణ్ణంగా పరిశీలించగలరు.నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ఆహార భద్రతా శాఖను కోరుతూ అన్నారం సాయికుమార్ వినతి పత్రాన్ని సమర్పించారు.

# కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

## గాయపడిన మాజీ సర్పంచ్ అరిపొద్దీన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్... మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 16(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సదాశివపేట/బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి,మాజీ సర్పంచ్ అరిపొద్దీన్ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు,అనంతరం మేలిగిరిపేట గ్రామ బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తండ్రి అంజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మేలిగిరిపేట గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను





పరామర్శించారు. అంజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు,ఈ కార్యక్రమంలో సదాశివపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, కౌన్సిలర్ కొత్తగొల్ల సోమశేఖర్,సర్పంచులు సంతోష్ గౌడ్,మునిగే నవీన్,మాజీ ఎంపీటీసీలు శివకుమార్,హనుమంతు,అహ్మద్,మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, హనుమంత్ రెడ్డి,బాలరాజ్,శేఖర్, మాజీ ఉపసర్పంచ్ పద్మశాలి రమేష్, సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జ్ పెద్దగొల్ల శ్రీహరి, నాయకులు పాండు నాయక్,నిజాముద్దీన్,బసవరాజ్, సద్దాం,శేఖర్,శ్రీకాంత్,సర్వేశ్వర్ యాదవ్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూలై 18న సంగారెడ్డిలో మెగా జాబ్ మేళా...

## నిరుద్యోగ యువకులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా ఉపాధి అధికారి బి. రవికిరణ్ రెడ్డి




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 16(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ (శుక్రవారం) ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, సంగారెడ్డిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి. రవికిరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు,ఈ జాబ్ మేళాలో ప్రముఖ సంస్థలు స్వతంత్ర మైక్రో ఫిన్ లిమిటెడ్ మరియు క్వెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలు పాల్గొని అర్హులైన అభ్యర్థులకు నేరుగా ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఖాళీల వివరాలు:పోస్ట్: ఫీల్డ్ ఆఫీసర్

అర్హత:10వ తరగతి మరియు అంతకంటే పై విద్యార్హత,వయస్సు: 18--35 సంవత్సరాలు

జీతం: రూ.15,000 నుంచి రూ.20,000 వరకు

ఖాళీలు: 20 పోస్ట్: బ్రాడ్‌హ్యాండ్ సంబంధిత ఉద్యోగాలు (అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం)

అర్హత: ఇంటర్మీడియట్

వయస్సు: 18--35 సంవత్సరాలు

జీతం: నెలకు రూ.23,000

ఖాళీలు: 100 అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటా తదితర పత్రాలతో జాబ్ మేళాకు హాజరుకావాలని జిల్లా ఉపాధి అధికారి కోరారు,మరిన్ని వివరాలకు 08455-271010 ఫోన్ నంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

# జాతీయ రహదారిపై కొర్పల్ గ్రామానికి చెందిన యువకుడు మృతి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 16 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** అకోలా - నాందేడ్ జాతీయ రహదారి 161, చౌటకూరు,మండలం తాడిదానపల్లి చౌరస్తా టోల్గేట్ సమీపంలోని ఏం ఎస్ ఫంక్షన్ హాల్ ఎదురుగా బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొర్పల్ గ్రామానికి చెందిన, కనుగొల్ల ప్రవీణ్ , (తండ్రి శ్రీశైలం) మృతి చెందాడు, సంగారెడ్డి లోని ఫ్రైడ్ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ప్రవీణ్, డ్యూటీ ముగించుకొని ద్విచక్ర వాహనంపై, స్వగ్రామానికి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం, డివైడర్ పై మధ్యలో ఉన్న చెట్లలో ఆయన మృతదేహం పడి ఉండగా, మధ్యాహ్నం వరకు ఎవరు గమనించలేదు, బైకు ముందు మాత్రం బాగానే దెబ్బ తినడం వెనుక భాగంలో ఎలాంటి నష్టం లేకపోవడంతో, గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో, ప్రమాదం జరిగిందా లేక డ్యూటీ అలసలటతో నిద్రమత్తులో అదుపు తప్పి డివైడెరను డి,కొట్టిందా, అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు, సమాచారం అందుకున్న పోలీసులు, మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ఈ ఘటనపై కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు, పుల్కల్ ఎస్ఐ విశ్వజన్,తెలిపారు..

# హరీష్ వ్యూహాత్మక మౌనమేనా

హైదరాబాద్, జూలై 16, తెలంగాణ రాజకీయాల్లో ఏ క్షణంలోనైనా తనే ముందుండి ప్రత్యర్థులపై వ్యతిరేక దాడి చేయడమే తప్ప, ఎప్పుడూ రక్షణాత్మక ధోరణిలో రాజకీయాలు చేసే అలవాటు లేని బలమైన నాయకుడు తన్నీరు హరీష్ రావు దీనికి ప్రధాన కారణం సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఆయనపై పెద్దగా అవినీతి మరకలు లేకపోవడమే. గతంలో ఆయనపై వచ్చిన విమర్శలన్నీ కేవలం రాజకీయ కోణంలో చేసినవే తప్ప, పక్కా ఆధారాలతో ఆయన్ను ఇరకాటంలో పెట్టే స్థాయి ఆరోపణలు ఇప్పటి వరకు రాలేదు. కానీ, ప్రస్తుతం హరీష్ రావు తన రాజకీయ జీవితంలోనే మొదటిసారిగా సమాధానం చెప్పుకోవాల్సిన సంకట స్థితిలో పడ్డారు. ఈ వివాదానికి కేంద్ర బిందువు హరీష్ రావు సతీమణి యాజమాన్యంలోని మిల్చీ మిల్క్ డైరీ బ్రాండ్. ఈ కంపెనీ మార్కెట్‌లో సాధారణ ప్రజలకు పంపిణీ చేసే వాటా చాలా పరిమితంగా ఉన్నప్పటికీ.. హైదరాబాద్‌లోని బడా కార్పొరేట్ ఆసుపత్రులు, ప్రముఖ విద్యాసంస్థలు , కాలేజీలకే అత్యధికంగా పాలను సరఫరా చేస్తుందనే ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార బలాన్ని ఉపయోగించి, సదరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్పొరేట్ విద్యాసంస్థలను, ఆసుపత్రులను బెదిరించి బలవంతంగా ఈ బ్రాండ్ పాలను కొనుగోలు చేయించారనే తీవ్రమైన ఆరోపణలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఈ వ్యవహారంపై కల్వకుంట్ల కవితతో పాటు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా నేరుగా ఇవే ఆరోపణలు గుప్పించడంతో ఈ అంశానికి రాజకీయంగా మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. హరీష్ రావు కుటుంబ ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఆరోపణలు ఇలా సాగుతుండగానే, ఊహించని విధంగా మిల్చీ మిల్క్ అధికారిక వెబ్‌సైట్ హఠాత్తుగా ఇంటర్నెట్ నుండి డౌన్ కావడం ఈ వివాదాన్ని మరింత పెంచింది. వెబ్‌సైట్ డౌన్ చేయడానికి అఫీషియల్ క్లైంట్స్ పేజీలో ఉన్న బడా విద్యాసంస్థల లోగోలు, పేర్లను కొందరు స్క్రీన్ షాట్లు తీసి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేయడమేనని తెలుస్తోంది. ఈ స్క్రీన్ షాట్లు నెట్టింట వైరల్ కావడంతో, హరీష్ రావు క్యాంప్‌లో కొంత కంగారు మొదలైందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. నిజంగానే అక్రమాలు జరగకపోతే వెబ్‌సైట్‌ను ఎందుకు బ్లాక్ చేయాల్సి వచ్చిందనే ప్రశ్నలను ప్రత్యర్థులు బలంగా సంధిస్తున్నారు. అయితే, తన రాజకీయ జీవితంలో ఎంతటి పెద్ద సంక్షోభాలనైనా సమర్థవంతంగా ఎదుర్కొన్న హరీష్ రావు.. ఇంతవరకు ఈ మిల్చీ మిల్క్ వివాదంపై నేరుగా ఎక్కడా స్పందించలేదు. సాధారణంగా తనపై చిన్న విమర్శ వచ్చినా గణాంకాలతో సహా తిప్పికొట్టే హరీష్, ఈ ఫ్యామిలీ బిజినెస్ వివాదంలో వ్యూహాత్మక మౌనం వహించడం వెనుక ఉన్న కారణాలపై రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ప్రస్తుత తరుణంలో ఆయన ఈ అంశంపై గట్టిగా, పక్కా ఆధారాలతో స్పందించాల్సిన అవసరం కనిపిస్తోంది.రాబోయే రోజుల్లో హరీష్ రావు కనుక ఈ ఆరోపణలను బలంగా తిప్పికొట్టి తన వాదనను ప్రజల ముందు ఉంచగలిగితే ఈ వివాదానికి బ్రేక్ పడే అవకాశం ఉంటుంది.

అలా కాకుండా ఈ మౌనాన్ని ఇలాగే కొనసాగిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని ఒక బలమైన పొలిటికల్ అస్త్రంగా మలచుకుని, ఎల్లప్పుడూ క్లీన్ ఇమేజ్‌తో ఉండే హరీష్ రావును రాజకీయంగా కార్నర్ చేస్తూనే ఉండే ప్రమాదం ఉంది. ఏదేమైనా, ఎప్పుడూ డిఫెన్స్‌లో పడనని చెప్పుకునే హరీష్ రావుకు ఈ డైరీ వివాదం ఒక పెద్ద పరీక్షగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదని భావిస్తున్నారు.

# పంచాయితీలకే పరిమితమవుతున్న మీనాక్షి

వరంగల్, జూలై 16, తెలంగాణలో అధికారంలోకి వచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీని అంతర్గత విభేదాలు, వరుస వివాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై దృష్టి సారించడం పక్కన పెట్టి, నేతల మధ్య కుమ్ములాటలను సర్దుబాటు చేయడానికే హైకమాండ్ ప్రతినిధుల సమయం అంతా సరిపోతోంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పరిస్థితి కూడా సరిగ్గా ఇలాగే తయారైంది. ఆమె గాంధీ భవన్‌కు వచ్చినప్పటి నుండి నియోజకవర్గాల వారీగా ఉన్న 'పంచాయితీ'లను పరిష్కరించడానికే తన శక్తినంతా ధారపోయాల్సి వస్తోంది.ఇప్పటికే కామారెడ్డి, తుంగతుర్తి, గజ్వేల్ నియోజకవర్గాల్లోని వర్గపోరు పార్టీకి పెద్ద తలనొప్పిగా మారగా, తాజాగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఎపిసోడ్, అలాగే కొండా సురేఖ వర్సెస్ కడియం శ్రీహరి వివాదాలు పార్టీలో మరింత అగ్గి రాజేసాయి. ఈ సమస్యలన్నింటినీ సెట్ చేయడానికి మీనాక్షి నటరాజన్ వరుస సమావేశాలు నిర్వహిస్తూ బిజీబిజీగా గడుపుతున్నారు. దీనివల్ల ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించే అవకాశం, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే వ్యూహాలు అమలు చేసే సమయం ఆమెకు దొరకడం లేదనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది.ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నడుస్తున్న నలిగిపోతున్న వివాదమే. ఈ ఇద్దరు సీనియర్ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్న పరిస్థితులపై మీనాక్షి నటరాజన్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. గాంధీ భవన్‌లో మంత్రి కొండా సురేఖ, మీనాక్షి నటరాజన్‌తో సుమారు 15 నిమిషాల పాటు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కడియం శ్రీహరి వైఖరిపై, ఆయన వ్యవహరిస్తున్న తీరుపై గతంలో తామిచ్చిన ఫిర్యాదు లేఖను ఈ సందర్భంగా సురేఖ మరోసారి ఇంచార్జ్ ముందుంచారు.మరోవైపు, కడియం శ్రీహరి మాత్రం ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు అస్సలు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. తాను ఎలాంటి పొరపాటూ చేయలేదని, కేవలం తన నియోజకవర్గ పనులపై సమీక్ష నిర్వహిస్తే, దాన్నేదో పెద్ద నేరంగా చిత్రీకరిస్తూ కొండా సురేఖ రాద్ధాంతం చేస్తున్నారని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. తనలాంటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడిని అనవసరంగా వివాదాల్లోకి లాగడం వల్ల వ్యక్తిగతంగా తనకే కాకుండా, పార్టీకి కూడా పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని ఆయన వాదిస్తున్నారు. ఈ వివాదంపై ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఇప్పటికే పూర్తి నివేదికను సిద్ధం చేసి పార్టీ హైకమాండ్‌కు సమర్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మంటలు చల్లారడం లేదు.ఒకవైపు వరంగల్ రాజకీయం ఇలా ఉంటే, మరోవైపు తుంగతుర్తి నియోజకవర్గంలో నెలకొన్న వర్గ విభేదాలు కూడా పార్టీని ఇరకాటంలో పడేస్తున్నాయి. ఈ తుంగతుర్తి ఎపిసోడ్‌కు సంబంధించి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని పిలిపించి మీనాక్షి నటరాజన్ సుదీర్ఘంగా మాట్లాడారు. నియోజకవర్గంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలే తప్ప, వ్యక్తిగత విభేదాల జోలికి వెళ్లొద్దని ఆమె ఎంపీకి గట్టిగానే సూచించారు.ఇదే సమయంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఎపిసోడ్ పార్టీకి మరో పెద్ద తలనొప్పిగా మారింది. శివచరణ్ వ్యవహార శైలిపై సీనియర్ నేతలు మధుయాష్కీ, ఈశ్వరమ్మ వంటి వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఫిర్యాదులు చేశారు. ఈ వ్యవహారాన్ని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా చాలా సీరియస్‌గా తీసుకున్నారు. అయితే, ఈశ్వరమ్మపై తాను చేసిన వ్యాఖ్యలకు గానూ శివచరణ్ రెడ్డి ఇప్పటికే బహిరంగంగా క్షమాపణలు చెప్పినప్పటికీ, పార్టీ అంతర్గత క్రమశిక్షణపై ఈ ఘటన ప్రభావం చూపించింది.అధికారంలో ఉన్న పార్టీగా ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకెళ్లడం, పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడం ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ప్రధాన బాధ్యత కావాలి. కానీ, దురదృష్టవశాత్తూ నేతల మధ్య ఉన్న ఆధిపత్య పోరు, ఈగో క్లాషెస్ కారణంగా ఆమె సమయమంతా గాంధీ భవన్‌లో రాజీ పంచాయితీలు చేయడానికే సరిపోతోంది. కామారెడ్డి, గజ్వేల్, తుంగతుర్తి, వరంగల్.. ఇలా ఏ నియోజకవర్గం చూసినా గ్రూపు రాజకీయాలే కనిపిస్తున్నాయి.మీనాక్షి నటరాజన్ ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఈ అంతర్గత కుమ్ములాటలు ఎంతవరకు సర్దుమణుగుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. నేతలు తమ వ్యక్తిగత పంతాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం వైపు దృష్టి సారించకపోతే.. ఇంచార్జ్ ఎన్ని కమిటీలు వేసినా, ఎన్ని గంటలు చర్చలు జరిపినా ఫలితం శూన్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# హైడ్రా వేటలో రియల్ ఎస్టేట్ రాముడు టార్గెట్

## తెలంగాణ రాజకీయాల్లో తెర వెనుక ఏం జరుగుతోంది?

హైదరాబాద్, జూలై 16, హైదరాబాద్ మహానగరంలో చెరువుల సంరక్షణ, అక్రమ కట్టడాల కూల్చివేతలే ధ్యేయంగా దూసుకుపోతున్న హైడ్రా చర్యలు రోజురోజుకూ సరికొత్త పొలిటికల్ టర్న్ తీసుకుంటున్నాయి. కేవలం సాధారణ నిబంధనల ఉల్లంఘనల ఆధారంగానే కాకుండా, ఒక పక్కా వ్యూహం ప్రకారం బడా ప్రాజెక్టులపై హైడ్రా విరుచుకుపడుతుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ప్రదీప్ బిల్డర్స్, సంధ్యా కన్స్ట్రక్షన్స్ అధినేత శ్రీధర్ రావుకు సంబంధించిన ప్రాజెక్టులతో పాటు మరికొన్ని ప్రతిష్టాత్మక నిర్మాణాలను హైడ్రా టార్గెట్ చేయడం వెనుక బలమైన రాజకీయ, ఆర్థిక కారణాలు ఉన్నాయనే చర్చ రియల్ ఎస్టేట్ వర్గాల్లో జోరందుకుంది.ఈ మొత్తం వ్యవహారంలో తెరపైకి వస్తున్న అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. హైడ్రా విరుచుకుపడుతున్న ఈ బడా ప్రాజెక్టులన్నింటికీ ఒక అంతర్గత లింక్ ఉందనే ప్రచారం సాగడం. ఈ లింక్ నేరుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వైపు కనెక్ట్ అవుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఇటీవల సోషల్ మీడియా వేదికగా విసిరిన కొన్ని పరోక్ష విమర్శలు, రియల్ ఎస్టేట్ రాముడు అంటూ పెట్టిన నిక్ నేమ్ ఈ చర్చలకు మరింత ఆజ్యం పోశాయి. గత ప్రభుత్వ హయాంలో ఐటీ, మున్సిపల్ శాఖల నీడన సాగిన కొన్ని బడా రియల్ ఎస్టేట్ లావాదేవీల చిట్టా ఇప్పుడు బయటకు వస్తోందనే సంకేతాలు దీని ద్వారా వ్యక్తమవుతున్నాయి.నిజానికి బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఊహించని స్థాయికి దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే తెరవెనుక అనేక భారీ ఆర్థిక లావాదేవీలు, చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధుల మార్పులు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఈ ఇన్ అండ్ అవుట్ లావాదేవీలపై, ఎవరెవరికి వాటాలు వెళ్లాయనే దానిపై పక్కా సమాచారం ఉంటుంది. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత, వ్యవస్థలో వచ్చిన మార్పుల వల్ల ఆయా సంస్థల అంతర్గత సమాచారం, పాత లీకులు కొత్త ప్రభుత్వ పెద్దల చేతికి చిక్కినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ లీకుల ఆధారంగానే, గత ప్రభుత్వానికి అత్యంత సన్నిహితంగా ఉంటూ నిబంధనలను బేఖాతరు చేసిన సదరు బడా బిల్డర్ల ప్రాజెక్టులనే హైడ్రా ఇప్పుడు ప్రత్యేకంగా టార్గెట్ చేస్తోందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకులలో బలంగా వినిపిస్తోంది. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు.. గత పాలకుల ఆర్థిక మూలాలను దెబ్బతీసే ఒక వ్యూహాత్మక పొలిటికల్ అటాక్ అని భావిస్తున్నారు. ఎక్కడైతే గత ప్రభుత్వ పెద్దల ప్రయోజనాలు లేదా బినామీ హస్తాలు ఉన్నాయని అనుమానాలు ఉన్నాయో, సరిగ్గా ఆయా కట్టడాల వద్దకే హైడ్రా బుల్డోజర్లు వెళుండటం ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తోంది. ఇప్పుడు అందరినీ వేధిస్తున్న అతిపెద్ద ప్రశ్న.. ఈ హైడ్రా వేట ఇంతటితో ఆగిపోతుందా? లేక తెరవెనుక ఏవైనా బ్యాక్ గ్రౌండ్ సెటిల్మెంట్లు జరుగుతాయా? అనేది. సాధారణం గా రియల్ ఎస్టేట్ రంగంలో ఇలాంటి భారీ దాడులు జరిగినప్పుడు, సదరు వ్యాపారులు నష్ట నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వ పెద్దలతో సయోధ్య కుదుర్చుకునే ప్రయత్నాలు చేస్తుంటారనేది ఓ బహిరంగ రహస్యం. కానీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత కఠినమైన వైఖరి ని ప్రదర్శిస్తున్నారు. చట్టాన్ని ఉల్లం ఘించిన వారు ఎంతటి వారైనా వదిలేది లేదని ఆయన పదే పదే స్పష్టం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో హైడ్రా నిజంగానే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుని, ఈ బడా ప్రాజెక్టుల వెనుక ఉన్న అసలైన సూత్రధా రులను చట్టం ముందు నిలబెడుతుందా.. లేదా కేవలం రాజకీయ మైలేజ్ కోసమే ఈ రచ్చ సాగు తుందా అన్నది కాలమే నిర్ణయించాలి. హైడ్రా తీసుకుంటున్న ఈ దూకుడు నిర్ణయాలు అటు బీఆర్ఎస్ అగ్ర నాయకత్వానికి, ఇటు భాగ్య నగర రియల్ ఎస్టేట్ మాఫియాకు ఒక బలమైన హెచ్చరిక లాంటివని రాజకీయ వర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి.

# పల్నాడు జిల్లాలో ఆలయంలో చోరీ..

## హుండీ పగలగొట్టి నగదు అపహరణ..

నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామంలోని నూజెండ్లపల్లి అగ్రహారంలో ఉన్న శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు.?స్థానిక వివరాల ప్రకారం, దుండగులు అర్ధరాత్రి సమయంలో ఆలయంలోకి ప్రవేశించి, గర్భాలయం సమీపంలో ఉన్న హుండీ తాళాన్ని ధ్వంసం చేశారు. అనంతరం హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును అపహరించారు.నగదు తీసుకున్న అనంతరం, ఖాళీ హుండీని సమీపంలోని పొలాల్లో పడేసి పరారయ్యారు.?గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న గ్రామస్థులు హుండీ ధ్వంసమై ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.ఘటనా స్థలానికి చేరుకున్న నాదెండ్ల పోలీసులు క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టి దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.ఆలయంలో చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 14 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్..

## నిందితుల్లో కానిస్టేబుల్

భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెంలో 14 ఏళ్ల మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ జరిగింది. నిందితులలో ఒక పోలీసు కానిస్టేబుల్ వున్నాడు. ప్రేమ పేరుతో ఒకరు భయపెట్టి మరో ఇద్దరు కామాంధులు బాలికపై లైంగిక దాడికి తెగబడ్డారు. ఈ విషయం బయటకు చెబుతామని బెదిరించి మరో ఇద్దరు అత్యాచారం చేసారు. బాధిత బాలిక ఫిర్యాదుతో దారుణం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఆరుగురిపై పోక్సో కేసు నమోదు చేసారు. ఘటనకు సంబంధించి నలుగురు నిందితుల అరెస్ట్ అయ్యారు. నిందితుల నుంచి మూడు ఆటోలు, మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న కానిస్టేబుల్ వెంకటేష్, ఆటో డ్రైవర్ గణేష్ కోసం గాలింపు చేపట్టారు.

## ఎస్ ఐ ఆర్ గడువు పొడగింపును వినియోగించుకోవాలి: కేఎల్ఆర్



ఆన్ లైన్ దరఖాస్తు పూర్తి చేస్తే ఎన్యూమరేషన్ ఫామ్ అవసరం లేదు.ఆగస్టు 3 చివరి తేదీ... అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితారాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) గడువును మరో పదిరోజులు పొడగించటంపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జూలై 24 నుంచి ఆగస్టు 3 వరకు గడువును పొడగించటం వల్ల ప్రతీ ఓటర్ తమ ఓటును అప్ డేట్ చేసుకోవాలని కేఎల్ఆర్ సూచించారు. తుక్కుగూడ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.తప్పులు లేకుండా ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపి బూలకు ఇవ్వాలని కోరారు. ఆన్ లైన్ దరఖాస్తు చేసుకున్న వారు మ్యానువల్ గా ఎన్యుమరేషన్ ఫామ్స్ నింపాల్సిన పని లేదని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ఆగస్టు 10న ప్రచురించనున్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించి సెప్టెంబర్ 9 వరకు సవరణలు, కొత్త దరఖాస్తులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా విడుదల చేస్తారని కిచ్చెన్నగారు తెలిపారు.డిజిటలైజేషన్ ఇప్పటి వరకు 50 శాతానికి పైగా పూర్తి అయిందన్నారు. మిగతా ఓటర్లు సైతం ఎన్యూమరేషన్ ఫామ్స్ పూర్తి చేసి ఇవ్వటం, ఆన్ లైన్ దరఖాస్తులను పూర్తి చేసి ఓటును కాపాడుకోవాలని కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లు ఆగస్టు 3 వరకు అప్రమత్తంగా ఉండి ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించి... బూలకు సహకరించాలని లక్ష్మారెడ్డి కిచ్చెన్న సూచించారు.

## ఫిషింగ్ హార్బర్లో బోటు ప్రమాదం

విశాఖపట్నం విశాఖ ఫిషింగ్ హార్బర్లో అలల ఉద్ధృతికి బోటు బోల్తాపడి ఏడుగురు మత్స్యకారులు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనలో తాతారావు, ఆకాష్ తీవ్రంగా గాయపడి కేజీహెచ్లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4.5 లక్షల ఆస్తి నష్టం జరిగింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత మత్స్యకారులు వేడుకుంటున్నారు.

## గంజాయి అక్రమ రవాణాపై అనకాపల్లి పోలీసుల ఉక్కుపాదం

అనకాపల్లి జిల్లాలో పోలీసులు భారీ గంజాయి అక్రమ రవాణా ముఠాను పట్టుకున్నారు. రావికమతం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.1.1 కోట్ల విలువైన 220 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు కార్లను సీజ్ చేసి, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక బృందాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్ నగదు బహుమతులతో అభినందించారు.

# సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు

## హెచ్ఎంఎస్ - తెలంగాణ రక్షణ సేన గాంధేయమార్గంలో పోరాడి సాధించిన సంయుక్త విజయం




హైదరాబాద్ మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా నెలల తరబడి కాలయాపన చేసిన అప్రజాస్వామిక కాంగ్రెస్ ప్రభుత్వం.. నిరంకుశ సింగరేణి యాజమాన్యం మా ఉద్యమానికి దిగివచ్చిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు ఈనెల 17, 18 న మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నది.. ఇది వేలాది మంది సింగరేణి కార్మికుల గెలుపు. వారసత్వ ఉద్యోగాలు సింగరేణి కార్మికుల హక్కు. వేలాది మంది కార్మికులు అనారోగ్య సమస్యలతో మెడికల్ అన్ ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నెలల తరబడి మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా వారి మనోవేదనకు కారణమవుతోంది. మేము ఉద్యమించామని ఇప్పుడు మాత్రమే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయడం కాదు.. ప్రతి నెలా మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి. సింగరేణి కార్మికులు ఎవరిని సూచిస్తే వారికి వారసత్వ ఉద్యోగం ఇవ్వాలి.. మెడికల్ బోర్డు కు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్ ఫిట్ చేయాలని ఆమె అన్నారు.

## నిలుచున్న చోటే ప్రసవం కిందపడిన శిశువుకు గాయాలు

భద్రాద్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాతా శిశు కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. పురిటి నొప్పులతో వచ్చిన మహిళను అక్కడి వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదు. దాంతో గర్భిణి నిల్చున్న చోటే బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు కిందపడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. బిడ్డ పుట్టాక కూడా 10 నిమిషాల వరకు వైద్యులు రాలేదని కుటుంబ సభ్యుల ఆరోపణ. ఘటన చూసి ఇతర రోగులు భయాందోళనకు గురైయారు. పోలీసులు విచారణ చేపట్టారు.

# వసతులు లేవని గురుకుల బాలికల అందోళన

మహబూబాబాద్ కొత్తగూడ మండలంలోని గాంధీనగర్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల బాలికలు రోడెక్కదారు. మాకు దోమలు, పురుగులు కుట్టి శరీరం మొత్తం అలర్జీ లాగా అవుతుంది. రూల్ నంబర్లు వేసి మాతో బాత్రూంలు క్లీన్ చేయిస్తున్నారు. ఇదేంటని అడిగితే వేధిస్తున్నారని ఆరోపించారు. మేం పిల్లలం. తలా 20 రూపాయలు ఇస్తే బాత్రూంలు క్లీన్ చేయిస్తాం, లేదంటే మీరే చేసుకోండి అని ప్రిన్సిపాల్ మేడం అంటుంది. సంవత్సరం నుండి సరిగ్గా నీళ్లు రావట్లేదు. అడిగితే మార్కులు కట్ చేసి ఫెయిల్ చేస్తామని భయపెడుతున్నారని అన్నారు.

## సమాజంలో అశాంతిని సృష్టించే వారిని తరిమి కొట్టాలి బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి




బద్వేలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ సమాజంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నించే వారిని ప్రజలే తరిమి కొట్టాలని బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు గురువారం బద్వేల్ లో ఆయన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నప్పటికీ, వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సమాజంలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసే కుట్రపూరిత శక్తులకు వారు అండగా నిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి తో పాటు ఆపార్టీ నాయకులు పదేపదే అధికార పార్టీ నేతలపై బురద చల్లుతూ దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు హిందూ దేవతలు, సంప్రదాయాలపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘవిద్రోహ శక్తులకు వత్తాసు పలికే ఇలాంటి నేతలకు తగిన బుద్ధి చెప్పకపోతే మళ్లీ మళ్లీ నిరాధారమైన ఆరోపణలను చేస్తూనే ఉంటారని తెలియజేశారు. అధికారంలో ఉన్న తాము ఏదైనా చేస్తే... అధికారాన్ని అడ్డుపెట్టుకొని చేశారని అబాండాలు వేస్తారన్నారు. అదే ప్రజలు ఒకసారి తిరగబడితే మళ్లీ మన జోలికి రారని సూచించారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసే వారికి మీరే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రజల ఆదరణ, ఆశీస్సులే కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద బలమని, ప్రజల మద్దతు ఉన్నంతకాలం రాష్ట్ర అభివృద్ధిని ఏ శక్తి అడ్డుకోలేదని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను అన్ని స్థానాల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

రైతుల హక్కులను హరించే విధంగా వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే చీకటి చట్టాన్ని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడం జరిగిందన్నారు. భూ యజమానికి తన సొంత పొలంపై సర్వ హక్కులు కల్పిస్తూ మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతుల ఫోటోతో పాటు రాజముద్ర కలిగిన ఈ పాస్‌పుస్తకాలు భూ యాజమాన్యానికి మరింత భరోసా కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## బొప్పాయి అమ్మకాలలో దళారి వ్యవస్థను రద్దు చేయాలి



చిట్వేలి బొప్పాయి అధికంగా పండించే రైల్వే కోడూరు నియోజకవర్గంలో బొప్పాయి అమ్మకాలలో దళారీ వ్యవస్థను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత కోరారు. చిట్వేలి మండలం చెర్లోపల్లి లో బొప్పాయి, మామిడి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కష్టనష్టాలకు ఓర్చి బొప్పాయి పంటను పండిస్తున్నారని అన్నారు. నకిలీ విత్తనాలతో దళారీలు రైతులను బోల్తా కొట్టించి వారి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. ఢిల్లీ, ముంబాయి, ఇతర ప్రాంతాల నుండి వచ్చే బొప్పాయి వ్యాపారులను నేరుగా రైతుల వద్దకు వెళ్లనీయకుండా కోడూరు లోనే వారికి సకల సదుపాయాలు దళారీలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నేరుగా దళారీలే తమకు నచ్చిన రేటుకు బొప్పాయిని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. నకిలీ విత్తనాలతో సగం బొప్పాయి చెట్లు కాయకపోవడంతో దిగుబడి రాకపోవడంతో రైతులు సాగు కోసం పెట్టిన ఖర్చుల కోసం నానా అగచాట్లు పడుతున్నారని తెలిపారు. వారం క్రితం కిలో 25 రూపాయలు అమ్మిన బొప్పాయి ప్రస్తుతం దళారీలు రూ.18 కి తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యులు పందికాళ్ళ మణి పాల్గొన్నారు.

## గంజాయి రవాణాదారులపై రూరల్ పోలీసుల కఠిన చర్యలు : పీఐటీ ఎన్డీపీఎస్ చట్టం కింద నిందితుడి అరెస్ట్

చిలకలూరిపేట: గంజాయి రవాణాపై పల్నాడు జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు నేతృత్వంలోని బృందం అక్రమ రవాణాదారులపై నిఘా తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో, రెండు అంతకంటే ఎక్కువ కేసులు నమోదై సమాజానికి ముప్పుగా మారిన ముఠా సభ్యులను గుర్తించి, పీఐటీ ఎన్డీపీఎస్ (ఖమి ఔఆఖూ ఝఇబి - 1988) చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటోంది. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు కి నిందితుడు ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, గతంలో చల్లా గోపిపై చర్యలు తీసుకున్న పోలీసులు, తాజాగా కారసాని శివప్రసాద్ రెడ్డి (అలియాస్ ప్రసాదరెడ్డి) అనే గంజాయి విక్రయదారుడిని అరెస్ట్ చేశారు. ఇతనిపై నమోదైన నేర చరిత్రను పరిశీలించిన ప్రభుత్వం, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో డిటెన్షన్‌లో ఉంచాలని ఉత్తర్వులు జారీ చేసింది. జులై 15న సీఐ బి. సుబ్బానాయుడు, రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిందితుడిని జైలుకు తరలించారు.

## కాళేశ్వరం బ్యారేజీల పై హైకోర్టు విచారణ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

హైదరాబాద్ కాళేశ్వరం బ్యారేజీల అంశంపై కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం, ఎన్డీఎస్యే కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మేడిగడ్డ పిల్లర్ల మరమ్మతులు చేపట్టకుండా రాజకీయాలు చేస్తున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలయిన విషయం తెలిసిందే.కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని పిటిషనర్ ఆరోపణ. రైతుల ప్రయోజనాల కోసం ఎన్డీ ఎస్ ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డను పునరుద్ధరించాలని వాదన. మిగిలిన రిజర్వాయర్లపై కూడా ఎన్డీఎస్ ఏ దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, కన్నెపల్లి, సుందిళ్ల పంప్హౌస్ల భద్రతపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, ఎన్డీఎస్ ఏ తో పాటు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

# వెంకన్న సన్నిధి... వికలాంగుల పెన్నిధి

### తిరుమల వెళ్లలేని దివ్యాంగుల కోసం "ట్రస్ట్"? సాయం

### ఖర్చులన్నీ వాళ్లవే

### ఏడుకొండలవాడి చెంతకు వెళ్లలేని వారికి అండగా నిలుస్తోన్న "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్"

హైదరాబాద్ : ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన భారత పుణ్యక్షేత్రాలలో "తిరుమల" ఒకటి. ఏడుకొండలపై విష్ణుమూర్తి అవతారంలో కొలువై ఉన్న ఆ వేంకటేశ్వర స్వామి దర్శనానికి నిత్యం ఎంతో మంది భక్తులు తరలి వెళ్తుంటారు. ఆ కోనేటి రాయుడిని కనులారా చూసి, మనసారా వేడుకుంటారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకుంటుంటారు. అయితే, చాలా మంది భక్తులు కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా దర్శించుకుంటే మరి కొద్దిమంది మాత్రం జీవితంలో ఒక్కసారి దర్శించుకున్నా చాలని కోరుకుంటారు. ఈ క్రమంలోనే ఒక్కసారి కూడా ఏడుకొండలవాడిని చూసుకోలేని వారికి అండగా నిలుస్తోంది ఓ సంస్థ. అదే "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్". నిరుపేదలు, దివ్యాంగులకు ఆ శ్రీనివాసుడి దర్శన భాగ్యం కల్పిస్తోంది.తిరుపతి వెంకన్నను దర్శించుకోవాలని చాలా మందికి ఉంటుంది. అయితే, చేతిలో డబ్బులు లేని కారణంగా కొద్దిమంది ఆ కోరికను తుంచుకుంటే దివ్యాంగులు వాళ్ల లోపం కారణంగా వెళ్లలేకుంటారు. అలాంటి వారందరికీ తిరుమలేశుడి దర్శన భాగ్యం కల్పిస్తోంది "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్".

**సంస్థకు పునాది ఆ ఆలోచనే**

హైదరాబాద్?కు చెందిన చుక్కల వేణుకుమార్? అనే వ్యాపారికి ఒకరోజు "ఒక్కసారైనా తిరుమల దర్శనం చేసుకోని వాళ్లుంటారా?" అనే సందేహం వచ్చిందట. ఆ క్రమంలోనే ఓసారి నాగోల్‌లో ఉన్న ఒక గుడికి వెళ్లినప్పుడు "తిరుపతికి వెళ్లని వాళు ‌న్నారా" అంటూ మైక్‌లో అడిగించారట. దీంతో "మేం వెళ్లలేదు" అని చాలా మంది చెప్పడం చూసి ఆశ్చర్యపోయారట. దాంతో తన సొంత డబ్బులతోనే కొందరు మురికివాడ ప్రజల్ని ఏడుకొండలు ఎక్కించారు వేణుకుమార్. తిరుమలకి వెళ్లాలని ఉన్నా పేదరికంతో వెళ్లలేనివారి కోసమే స్నేహితులతో కలిసి 2014లో "శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్"ను ఏర్పాటు చేశారు.



**ఖర్చులన్నీ ట్రస్ట్? తరపునే**

సమాజంలోని పేదలు, దివ్యాంగులకు ఆధ్యాత్మిక సేవలు అందించే ఒక ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఇది. జీవితంలో ఒక్కసారైనా తిరుమల కొండను సందర్శించి, శ్రీవారిని దర్శించుకోవాలని ఆశపడే దివ్యాంగులు, అంధులు, అనాథలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలు, జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తిరుమల కొండను సందర్శించని భక్తులకు ఈ ట్రస్ట్ పూర్తిగా ఉచితంగా తిరుపతి యాత్రను ఏర్పాటు చేస్తుంది. భక్తులకు తిరుమల వెళ్లడానికి రానూపోనూ ఛార్జీలూ, వసతి, భోజనం అన్నీ వాళ్లే చూసుకుంటారు.

**వాలంటీర్లు కూడా సిద్ధం**

ఈ ట్రస్ట్‌లో "గరుడ సేన" అనే వాలంటీర్ల బృందం పనిచేస్తుంది. తిరుమల యాత్రకు వచ్చే దివ్యాంగులకు, వృద్ధులకు కొండపై నడవడానికి, వీల్ చైర్ సదుపాయం కల్పించడానికి, సురక్షితమైన దర్శనం చేయించడానికి ఈ వాలంటీర్లు ఎల్లప్పుడూ తోడుగా ఉంటారు.టీటీడీ బోర్డు సాయం ఈ ట్రస్టు సేవలకి సాయంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఉచిత వసతి, దర్శన ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటి వరకూ సుమారు 3000 మంది భక్తులకు వెంకన్న దర్శనభాగ్యం కల్పించిందీ ట్రస్టు.

**ఎలా దరఖాస్తు చేసుకోవాలి**

ఈ ఉచిత సేవలను పొందడానికి ట్రస్ట్ అధికారిక మార్గాల ద్వారా ముందే పేరు నమోదు చేసుకోవాలి. అందుకోసం ట్రస్ట్ అధికారిక వెబ్‌సైట్ బజీబఇఇబి.నీతీణ లో లేదా వారి వాట్సాప్ నెంబర్ 96661 59999 అందించే గూగుల్ ఫారమ్‌ను పూరించాలి.అప్లై చేసుకునే సమయంలో భక్తుని ఆధార్ కార్డ్, దివ్యాంగులైతే సదరం సర్టిఫికేట్ లేదా నిరుపేదలయితే రేషన్ కార్డ్ జిరాక్స్?లను అందించాలి.ఈ యాత్రకు సంబంధించిన నమోదు ప్రక్రియ, తదుపరి యాత్ర ఎప్పుడు ఉంటుందో తెలుసుకోవడానికి మీరు నేరుగా ట్రస్ట్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. ఈ ట్రస్ట్? మల్కాజ్?గిరిలో ఉంది.అనేది ప్రధానంగా శారీరక వికలాంగులు, అనాథలు, నిరుపేదలకు ఉచిత తిరుమల దర్శనం కల్పించేందుకు ఏర్పాటయిన ఒక స్వచ్ఛంద సంస్థ.

## హిందూ విద్యార్థి తో కల్మా చదవాలని ఒత్తిడి .. సైదాబాద్లో ఉద్రిక్తత

హైదరాబాద్ హైదరాబాద్:- పాతబస్తీ పరిధిలోని సైదాబాద్లో ఉన్న సక్సెస్ స్కూల్లో 2వ తరగతి చదువుతున్న ఓ హిందూ విద్యార్థితో కల్మా చదవాలని పాఠశాల యాజమాన్యం ఆదేశించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. తమ పిల్లల మత విశ్వాసాలకు విరుద్ధంగా ఎలాంటి ప్రార్థనలు లేదా మతపరమైన పాఠాలు బలవంతంగా చెప్పించడం సరైంది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని సిబ్బంది తీరు పట్ల విద్యార్థి కన్నీరు పెడుతు ఇంటికి రావడంతో తల్లితండ్రులు గమనించి అడగగా అసలు విషయం వెలుగులోకి రావడం జరిగింది.. ఈ ఘటనపై సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, ఆరోపణలు నిజమైతే పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

మరోవైపు. హిందూ సంఘాలు స్కూలు ముందు అందోళన చెపట్టాయి. స్కూలు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేసాయి. పరిస్థితులు ఉద్రిక్తతంగా మారడంతో పోలీసులు అందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

## పంట పొలాలకు విద్యుత్ సమయాన్ని పెంచాలి. రైతుల వినతి




సి.బెళగల్, జూలై 16 రైతులకు వ్యవసాయ అవసరాల కోసం ప్రస్తుతం అందిస్తున్న 9 గంటల విద్యుత్ సరఫరా సమయాన్ని పెంచడంతో పాటు, కేటాయించిన సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ అందించాలని కోరుతూ సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, కమ్మదహాల్ గ్రామాల రైతులు బుధవారం మండల విద్యుత్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడి జాన్సన్, ఏఈ సుకుమారును కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగారైతులు మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం, కాలువల ద్వారా సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం బోరు బావులపైనే పూర్తిగా ఆధారపడాల్సి వస్తోందని, అయితే విద్యుత్ సరఫరా మధ్య మధ్యలో నిలిచిపోవడం వల్ల మోటార్లు సక్రమంగా నడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పంటలకు సకాలంలో నీరు అందక రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కనీసం ప్రస్తుతం కేటాయించిన 9 గంటల విద్యుత్‌ను కూడా అంతరాయం లేకుండా నిరంతరంగా అందించాలని, సాధ్యమైనంత వరకు విద్యుత్ సరఫరా సమయాన్ని మరింత పెంచాలని అధికారులను కోరారు. రైతుల సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు మారందొడ్డి టీడీపీ నాయకుడు జక్రియ భాష, కమ్మదహాల్‌కు చెందిన భాస్కర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రాణాపాయంలో ఉన్న వ్యక్తిని కాపాడిన మాజీ కౌన్సిలర్ సురేంద్ర..

## సమయస్ఫూర్తితో ప్రాణం కాపాడిన వైనం..



నందికొట్కూర్ బ్రాహ్మణకొట్టుకూరు? బొల్లవరం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని నందికొట్కూరు మాజీ కౌన్సిలర్ సురేంద్ర అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. కర్నూలు నుంచి మిద్దూరుకు బైక్‌పై ప్రయాణిస్తున్న డాక్టర్ ఫారుక్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై రక్తస్రావంతో అక్కడే పడి ఉన్నారు. వెనుకనే కారులో వస్తున్న మాజీ కౌన్సిలర్ సురేంద్ర ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. గాయపడిన డాక్టర్ ఫారుక్ ను స్వయంగా ఎత్తుకుని తన కారులో ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. సమయానికి వైద్యం అందడంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా నివారించగలిగారు. ఈ విషయం తెలుసుకున్న బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని సురేంద్ర చేసిన సేవాభావాన్ని కొనియాడారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో సహాయం చేసి ప్రాణరక్షకుడిగా నిలిచిన సురేంద్రపై స్థానికులు ప్రశంసల వర్షం కురిపించారు.

## ప్రైవేట్ స్కూళ్ల దోపిడీపై చర్యలు తీసుకోవాలని డీఈఓ కు ఫిర్యాదు

## సోషల్ ఆక్టివిస్ట్ అన్నారం సాయికుమార్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 16(ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్న అధిక ఫీజులపై జిల్లా విద్యాశాఖ అధికారి తనిఖీలు నిర్వహించాలని సామాజిక కార్యకర్త అన్నారం సాయికుమార్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ మార్గదర్శకాల అమలును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా, డీఈవో ప్రభుత్వ పాఠశాలలను కూడా సందర్శించి, అక్కడ నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ బడులకు అవసరమైన మౌలిక వసతులు, విద్యా సామగ్రిని సమకూర్చి, విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు అవగాహన కల్పించాలని అన్నారం సాయికుమార్ వినతి పత్రాన్ని సమర్పించారు

## దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు



శ్రీశైలం లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ( ఎ ˇ తి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది.

కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు.

శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చోని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

## యువకుడి దారుణ హత్య



పిఠాపురం నియోజకవర్గం మూలపేట గ్రామంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అమ్మమ్మ అంత్యక్రియలకు వచ్చిన పెదపూడి మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన రాకేష్ (28) హత్యకు గురైయాడు. ఒక దుకాణం వద్ద రాకేష్ చెల్లితో కొందరు యువకులు అసభ్యకరంగా ప్రవర్తించడంతో వివాదం తలెత్తింది. తన చెల్లిని ఎందుకు కామెంట్ చేశారని రాకేష్ నిలదీయడంతో సదరు యువకులతో ఘర్షణ కు దిగారు. అమ్మమ్మ ఖననం కోసం స్మశాన వాటికకు వెళ్లిన రాకేష్పై వంశీ అనే యువకుడు, మరో నలుగురు చాకుతో దాడికి దిగారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రాకేష్ను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఆసుపత్రికి తరలించే లోపే రాకేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువకుడి దారుణ హత్యతో పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### ఫారాల డిజిటలైజేషన్‌లో జాప్యం వద్దు.. ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించడం బీఎల్‌వోల బాధ్యత




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూలై 16:**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (SIR కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం బోయిన్పల్లి, ఫతేనగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న SIR ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను వెంటనే స్వీకరించి జాప్యం లేకుండా డిజిటలైజ్ చేయాలని సూచించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించడం, వారి సందేహాలను నివృత్తి చేయడం బూత్ లెవల్ అధికారుల (BLO) ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా పూరించేందుకు ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని, ప్రతి అర్హ ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వామి అయ్యేలా కృషి చేయాలని బీఎల్‌వోలకు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు.

## సర్ ఫారాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలి

## శామీర్‌పేటలో ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, జూలై 16:** ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణను వేగవంతం చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. గురువారం శామీర్‌పేట గ్రామంలో కొనసాగుతున్న ాఞ= ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలకు కేటాయించిన మొత్తం ఎన్యుమరేషన్ ఫారాల సంఖ్య, ఇప్పటివరకు పంపిణీ చేసినవి, తిరిగి స్వీకరించిన ఫారాల వివరాలను కలెక్టర్ నేరుగా అడిగి తెలుసుకున్నారు. స్వీకరించిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, వారి సందేహాలను నివృత్తి చేస్తూ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని బీఎల్‌వోలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో శామీర్‌పేట తహసీల్దార్ సీహెచ్. శ్రీనివాస్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## ఆ వార్తలు నిరాధారం

### మా అబ్బాయి డ్రగ్స్ తీసుకోలేదు

### అరెస్ట్ కాలేదు ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి

హైదరాబాద్ మా అబ్బాయి భరత్ రాజ్ రెడ్డి డ్రగ్స్ తీసుకున్నట్టు.. మంగళ్ హాట్ పోలీసులు అరెస్ట్ చేసినట్టు జరుగుతున్న ప్రచారం లో వాస్తవం లేదు. మీడియాలో, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారం.. అవాస్తవమని ఎమ్మెల్సీ వెంకట్రాం రెడ్డి వివరణ ఇచ్చారు. గురువారం ఉదయం మంగళ్ హాట్ పోలీసులు మా ఇంటికి వచ్చి ఒక డ్రగ్స్ కు సంబంధించి కేసు విచారణ జరుపుతున్నామని.. భరత్ రాజ్ రెడ్డి కామన్ ఫ్రెండ్స్ ఫోన్ జాబితాలో తన ఫోన్ నెంబర్ ఉండడంతో అనుమానంతో విచారించాల్సి ఉందని కోరారు. విచారణలో ఈ డ్రగ్స్ కేసు వ్యవహారానికి భరత్ రాజ్ కు ఏ సంబంధం లేదని పోలీసులు నిర్ధారించుకున్నారు. భరత్ రాజ్ కు చేసిన డ్రగ్స్ టెస్ట్ లో నెగెటీవ్ వచ్చింది. ఈ విషయంలో అనేక అవాస్తవాలు, కల్పిత సమాచారం ప్రచారంలో ఉన్నాయి. నాకుమారుడు ఎన్నడూ డ్రగ్స్ తీసుకోలేదు... ఈ కేసులో అరెస్ట్ కాలేదని అన్నారు.

# గ్రామీణాభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి...:జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 16(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లాలో చేపడుతున్న గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు,గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎల్పీవోలు,డీపీఎంలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలు, ఏఈలు తదితర అధికారులతో వివో భవనాలు, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, పాఠశాల మరుగుదొడ్లు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌లు వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు , ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పాఠశాల కాంపౌండ్ వాల్స్, కల్వర్టులు, డ్రైనేజీ పనులు, ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్ భవనాలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై మండలాల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో వివో భవనాల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు,కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు,జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు,పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో వినియోగానికి అనుకూలంగా ఉండేలా స్ట్రీమ్‌లైన్ చేయాలని,మరుగుదొడ్లు అవసరమైన పాఠశాలలకు కొత్త టాయిలెట్ల నిర్మాణానికి సంబంధించిన అంచనా ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. అలాగే అవసరమైన పాఠశాలల్లో కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు అంచనా ప్రణాళికలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు,గ్రామీణాభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర అత్యంత కీలకమని , మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో డివిజనల్ పంచాయతీ అధికారులు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి అభివృద్ధి పనిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు,ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు,ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, డీఆర్‌డీఓ జ్యోతి, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఇన్‌చార్జి సీపీఓ జగదీష్, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గూడ్స్ వాహనంలో కూలీల తరలింపు.. వాహనం సీజ్



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై -16** బోయిన్పల్లి మండలం వెంకట్రావుపల్లె వద్ద వ్యవసాయ కూలీలను గూడ్స్ వాహనంలో తరలిస్తున్న ఓ వాహనాన్ని రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. వరి నాట్ల సీజన్ నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్న మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీధర్ ఈ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు అధికారులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రయాణికులను గూడ్స్ వాహనాల్లో తరలించడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రాణాలకు ప్రమాదకరమని తెలిపారు. నాట్ల పనులకు వెళ్లే కూలీలు తప్పనిసరిగా ప్యాసింజర్ వాహనాల్లోనే ప్రయాణించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి కూలీలను గూడ్స్ వాహనాల్లో తరలించే వాహన యజమానులు, డ్రైవర్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని రవాణా శాఖ అధికారులు హెచ్చరించారు



## సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కోసం భవనాల పరిశీలన . అధికారులతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై -16 ( ప్రజాబలం ప్రతినిధి )**రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కోసం జిల్లాలోని పలు భవనాలను అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు.ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ కింద అల్పాహారం, పాలు అందించే కార్యక్రమంలో భాగంగా ఆహార పదార్థాలు సిద్ధం చేసేందుకు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని పలు భవనాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ (హెచ్ కే ఎం సీ ఎఫ్) బాధ్యులు గురువారం పరిశీలించారు. పరిశీలనలో సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు మహేష్, జయంత్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయాలి: నిర్మలా జగ్గారెడ్డి




**జహీరాబాద్, జులై 16 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. జహీరాబాద్ పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.మాజీ మంత్రి, జహీరాబాద్ ఇంచార్జి డా. ఏ. చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటరు నమోదు ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారాల భర్తీ, ప్రజల్లో అవగాహన కల్పించడం తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి అర్హులైన ఓటరును జాబితాలో నమోదు చేయాలని, ఇంటింటికీ వెళ్లి ఎవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా చూడాలని నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు కార్యకర్తలకు సూచించారు.



ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో జహీరాబాద్ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీ ఇండస్ట్రియల్ చైర్మన్ తన్వీర్, కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్ రెడ్డి, అసెంబ్లీ కోఆర్డినేటర్ మహమ్మద్ గౌస్, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, కోహీర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్, సీడీసీ చైర్మన్ ముబీన్, పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మండల అధ్యక్షులు హుగ్గేల్లి రాములు, భాస్కర్ రెడ్డి, సువర్ణ మల్లన్న పాటిల్, పవన్ రాథోడ్, కోహీర్ పట్టణ అధ్యక్షుడు ముజాఫ్ఫర్, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాక్సూద్ అహ్మద్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామెల్, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కౌన్సిలర్లు, సర్పంచులు, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ జడ్పీటీసీ అరవింద్ రెడ్డికి ఎమ్మెల్యే నివాళి



**కోహీర్, జులై 16 ప్రజాబలం ప్రతినిధి:** కోహీర్ మండలం మాజీ జడ్పీటీసీ స్వర్గీయ అరవింద్ రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అరవింద్ రెడ్డి సమాజ అభ్యున్నతి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, సీనియర్ నాయకులు ఖలీమ్, మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు రవికిరణ్, గోవర్ధన్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సంపత్, సందీప్, అస్లాం, వజిత్, రవికుమార్, చాంద్, విజయ్, అఖిల్, ప్రకాష్, ప్రశాంత్, యాదన్న, అసాద్, నరసింహులు, గంగన్న, విజయ్ కుమార్, మొయిస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు ప్రమాదం, అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబాలను పరామర్శించిన డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు



**కోనరావుపేట ప్రజాబలం దినపత్రిక జూలై – 16** కోనరావుపేట మండలంలోని బాసవుపేట గ్రామానికి చెందిన పోకల మధుకర్ ఇటీవల కొండగట్టులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందగా, నిమ్మపల్లి గ్రామానికి చెందిన తోట స్వప్న అనారోగ్య కారణాలతో ఇటీవల మృతిచెందారు. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు గురువారం ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలతో మాట్లాడిన ఆయన, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలనిఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల బాలాజీ, జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గొట్టే రామచంద్రం, మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేష్ గౌడ్, ఎక్కలదేవి జలందర్, మండల ఉపాధ్యక్షులు చింతల పరుశురాములు, చీకటి మధు, మండల కార్యదర్శి వేల్పుల తిరుపతి, సీనియర్ నాయకులు జింక వెంకటి, కుమ్మరి దిలీప్ కుమార్ , మోత్కు మోహన్, జిన్నా అనిల్, వామన్, బార్కం రమేష్, కృష్ణస్వామి, నాగరాజు, తిరుపతితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్క పురుగుల బెడద.. రైతుల ఆందోళన

కామారెడ్డి రామారెడ్డి మండలం మోషంపూర్ గ్రామంలో గోదాముల ఎదుట గ్రామస్తులు బైఠాయించారు. గోదాముల నుంచి లక్క పురుగులు ఇండ్లలోకి వస్తున్నాయని గ్రామస్తుల ఆవేదన. పురుగుల కారణంగా ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

# మంజీరా నది వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు




**జహీరాబాద్, జూలై 16 ప్రజాబలం ప్రతినిధి:**న్యాల్కల్ మండలంలోని రాఘవాపూర్ గ్రామ సమీపంలోని మంజీరా నది వద్ద ప్రమాదాలను నివారించే ఉద్దేశంతో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు హద్నూర్ ఎస్సై సుజిత్ తెలిపారు. నదిలో లోతైన ప్రాంతాలు ఉండటంతో ప్రజలు, మత్స్యకారులు, సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా భద్రతా నియమాలను పాటించాలని, నదిలో ఈతకు దిగడం, అనుమతి లేకుండా జేసీబీలు లేదా ఇతర భారీ వాహనాలను నదిలోకి తీసుకెళ్లడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరిక బోర్డులో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. హద్నూర్ ఎస్సై సుజిత్ ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# ఇంటింటికి రెండు చెత్తబుట్టల పంపిణీ



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 16 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** చౌటకూర్ మండల కేంద్రంలో గ్రామం-ఆరోగ్యం గ్రామం లక్ష్యంగా, చౌటకూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో, గ్రామంలోని ప్రతి కుటుంబానికి రెండు చొప్పున చెత్తబుట్టలను, పంపిణీ చేశారు, ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వర్కల రాంరెడ్డి, ప్రారంభించి గ్రామస్తులకు చెత్త బుట్టలను అందజేశారు, ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో ఇంటింటికి చెత్త సేకరణ వ్యవస్థను, మరింత సమర్థవంతంగా అమలు చేసి పరిశుభ్రతను కాపాడేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు, తడి,పొడి, చెత్తను వేరువేరు బుట్టలో వేసి గ్రామపంచాయతీ పరిశుద్ధ సిబ్బందికి అందించాలని, గ్రామస్తులకు సూచించారు, గ్రామ వీధులు,కాలనీలు, పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలందరూ బాధ్యతాయుతంగా సహకరించాలని, గ్రామ పరిశుభ్రత అంతా గ్రామపంచాయతీ ఒక్కదాని బాధ్యత కాదని, ప్రజల భాగస్వామ్యం తోటే స్వచ్ఛమైన గ్రామాన్ని నిర్మించుకోవచ్చు అని పేర్కొన్నారు, ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వహించాలని, పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కలాలి రామా గౌడ్, గ్రామ అధ్యక్షుడు వర్కల రమేష్, నాయకులు మల్లికార్జున గౌడ్, రాజేశ్వర్ గౌడ్, వార్డు సభ్యులు హరీష్ బాల్జ్ తదితరులు పాల్గొన్నారు....

# సర్ మ్యాపింగ్ లో బి ఆర్ ఎస్ నాయకుల పాత్ర కీలకం.



**గండిపేట ప్రజా బలం ప్రతినిధి 16 జులై 2026**భారత ఎన్నికల సంఘం తల పెట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎంతో కీలకమైన చర్యగా భావిస్తు బి ఎల్ ఒ ల వద్ద ఉన్న ఫారమ్ తీసుకుని రావడానికి, వాటిని పూరించడానికి స్థానికులు ఇబ్బందులకు గురి కాకుండా ఉండడానికి, ప్రతి ఓటర్ 2002 లోని తమ ఓటు లేదా తమ పెద్దల ఓటుతో ప్రస్తుత ఓటును జత కలుపడం (మ్యాపింగ్ చేసుకొవడం) లో మా వంతు కృషి, సహకారం, సంపూర్ణ మద్దతును అందిస్తూన్నామనీ బీ ఆర్ ఎస్ నాయకుడు అందె లక్ష్మణ్ రావు, దేవి ప్రియలు తెలిపారు. ఇట్టి క్రియాశీల కార్యక్రమంలో బూతులెవల్ అధికారుల పాత్ర ఎంత కీలకమో - ప్రజల పాత్ర కూడా అంతే కీలకం అని భావించి రాబోయే కాలంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ, ఇట్టి ఓటు మ్యాపింగ్ చర్యలకు ముందుకు రావాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆలస్యం నవీన్, పద్మారావు భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపుర్ నాయకులు గుట్టమీది నరేందర్, షేక్ ఆరిఫ్, మాల్యాద్రి నాయుడు, బుధోళ్ళ బబ్లు, షకీలా రెడ్డి, మంజు, ముత్యాలు, శ్రీనివాస్, బాషా తదితరులు గురువారం రోజున బట్టర్ఫ్లయి సర్కిల్ ప్రతిభ స్కూల్ మద్యన గల ఓల్డ్‌-ఛా1 హోటల్ వద్ద ఉదయం 10 నుండి 2 మరియూ సాయంత్రం 4 నుండి 8 వరకూ ప్రజలకు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

# మేడారం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి



ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థ, గ్రామం, ఇంటి పరిసరాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే ఉద్యమంగా వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా అవి పెరిగి పెద్ద వృక్షాలుగా మారే వరకు సంరక్షించడం ప్రతి పౌరుడు నైతిక బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ మేడారం అభివృద్ధి పనులన్నింటినీ నిర్దేశించిన

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం--తాడ్వాయి, పస్రా--మేడారం, చిన్నబోయినపల్లి--కొండాయి--ఊరట్టం రహదారుల విస్తరణకు యుద్ధ ప్రాతిపదికన అంచనాలు సిద్ధం చేసి, అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్యూ లైన్లను ఆధునికీకరించడంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జంపన్న వాగు పరిసర ప్రాంతాలను సుందరీకరించి, జంపన్న వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. దీని ద్వారా భక్తులకు ఏడాది పొడవునా పుణ్యస్నానాలు ఆచరించేందుకు నీరు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు.

ప్రధాన రహదారుల ఇరువైపులా, డివైడర్ల మధ్య పచ్చదనాన్ని పెంపొందించేలా పెద్దఎత్తున మొక్కలు నాటాలని, నూతనంగా ఏర్పాటు చేయనున్న స్మృతి వనాన్ని సహజసిద్ధమైన పచ్చదనంతో అభివృద్ధి చేయాలని సూచించారు. భక్తుల కోసం కాటేజీలు, విశ్రాంతి కేంద్రాల ఏర్పాటుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని



ఆదేశించారు.

ఆలయ పరిసరాలతో పాటు మొత్తం మేడారం ప్రాంతాన్ని పారిశుధ్య కార్మికుల ద్వారా నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, దుకాణదారులు తమ పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. రహదారులపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రవాణా, వైద్య సేవలు, భద్రత తదితర అన్ని మౌలిక సదుపాయాలను ముందస్తుగా సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

ప్రకృతిని మనం రక్షిస్తే ప్రకృతి మనలను రక్షిస్తుందనే భావనతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చున్నారు. ప్రతి

గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సమ్మక్క--సారలమ్మ వనదేవతల దర్శనం, జిల్లా అభివృద్ధి పైలాన్ ప్రారంభోత్సవం, నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు, సిహెచ్ మహేందర్ జి,సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి,ఆర్ డి ఓ కృష్ణవేణి, జిల్లా అధికారులు,ఆలయ పూజారులు,గుత్తేదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పూజారులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# కన్నవారిని పట్టించుకోకపోతే చర్యలు తప్పవు.

## 2007 చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తాం.

## ఆర్ డి ఓ కే.కృష్ణవేణి.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 16** ములుగు వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 ప్రకారం కన్నవారిని కొడుకులు పట్టించుకోని పక్షంలో చర్యలు తప్పవని తల్లిదండ్రులు, సీనియర్ పౌరుల పోషణ సంక్షేమ ట్రిబ్యునల్ అధికారి, ఆర్డీవో కే.కృష్ణవేణి తెలిపారు.



ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన గాదె నక్షత్రారెడ్డి, జేసింతమ్మ లు తమ కుమారులు గాదె అశోక్ రెడ్డి, గాదె అబ్రహం రెడ్డి లు తాము సంపాదించిన ఆరు గుంటల స్థలాన్ని ఇరువురికి సమానంగా పంపిణీ చేసిన అనంతరం తమను పట్టించుకోవడం లేదంటూ ఫిర్యాదు చేశారని అన్నారు.

ఈ క్రమంలో నక్షత్ర రెడ్డి కుమారులకు 2007 చట్టం సెక్షన్ 5 (1) ప్రకారం నోటీసులు జారీ చేయగా గత నెల 30వ తేదీన విచారణ చేయగా తల్లిదండ్రులను పట్టించుకోవడంలేదని విషయాన్ని పరిగణలోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. దీంతో 2007 చట్టం సెక్షన్ 9 (1) సెక్షన్ 4 ప్రకారం తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తి విషయంలో కొడుకులు జోక్యం చేసుకోరాదని తమ ఉత్తర్వులను పాటించని పక్షంలో చట్ట ప్రకారం కేసు నమోదు చేయబడతాయని కృష్ణవేణి తెలిపారు.

## మృత్యువాత నుండి బయటపడిన మత్స్యకారులు

## ఇద్దరికి తీవ్ర గాయాలు

కేజిహెచ్ లు చికిత్సబోటుపై ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. ఫిషింగ్ హార్బర్ కు దగ్గరలో సముద్రంలో చేపల వేట సాగిస్తుండగా సాగర జలాలు ఒక్కసారిగా వలను లాక్కున్నాయి. ఈ ఘటనలో పడవ బోల్తాపడి మత్స్యకారులపై పడింది. అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆ బోర్డుతో పాటు మత్స్యకారులు పెద్ద రాళ్లకు మధ్యలో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో మత్స్యకారులు బోటును పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డారు. తాతారావు, ఆకాష్ అనే ఇద్దరు మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన గంగపుత్రులు కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంతో రెండున్నర లక్షల పైగా విలువ చేసే బోటు, రెండు లక్షల రూపాయలు విలువ చేసే వల పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంతో మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోయారు. గంగమ్మ తల్లి అనుగ్రహంతో ప్రాణాలతో బయటపడ్డామని మత్స్యకారులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.

# చెరకు రైతుల సమస్యలపై కమిషనర్‌కు వినతి



**జహీరాబాద్, జూలై 16 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ ప్రాంత చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర చెరకు మరియు చక్కెర శాఖ కమిషనర్, డైరెక్టర్ సీహెచ్. నర్సిరెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించినట్లు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా చెరకు సాగుదారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

జహీరాబాద్ ప్రాంత చెరకు రైతుల హక్కులు, సంక్షేమం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని శివకుమార్ స్పష్టం చేశారు.

# ఈవో కుమార్తె మృతికి ఎమ్మెల్యే నివాళి

**జహీరాబాద్, జూలై 16 ప్రజాబలం ప్రతినిధి:** జరా సంఘం కేతకి సంగమేశ్వర దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివ రుద్రప్ప స్వామి కుమార్తె భవిత మృతి పట్ల జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గురువారం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఝరాసంగం మండల కేంద్రంలోని వారి నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మాజీ ఎంపీపీ బొగ్గల సంగమేశ్వర్, గ్రామ సర్పంచ్ వినోద్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ఫారాలు సమర్పించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు



**జహీరాబాద్, జూలై 16 ప్రజాబలం ప్రతినిధి:** ఝరాసంగం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గురువారం తన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసి ప్రత్యేక సమగ్ర సవరణ ఫారాలను సంబంధిత అధికారులకు అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పారదర్శకంగా, వేగవంతంగా ఎస్ఐఆర్ ఫారాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవడం బాధ్యతగా భావించి, వివరాలను నమోదు చేసి సంబంధిత బీఎల్‌వోలు లేదా అధికారులకు ఎస్ఐఆర్ ఫారాలను వీలైనంత త్వరగా అందజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు జగదీశ్, గ్రామ సర్పంచ్ వినోద్ బాల్‌రాజ్, వివిధ గ్రామాల సర్పంచులు రాజు, శివమణి, రాజ్‌కుమార్, నాగేందర్, సోహైల్, నాయకులు వెంకట్‌రెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, బీఎల్‌వోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టైప్ రైటింగ్ పరీక్షలు...



### స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. కృష్ణమూర్తి

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 16(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/టి.టి.ఎస్.సి.ఐ.ఎ. తెలంగాణ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. కృష్ణమూర్తి ఈ నెల 17,18 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు రెండు రోజుల పాటు సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇస్మాయిల్ ఖాన్‌పేట్ సమీపంలో ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. రోజుకు నాలుగు బ్యాచ్‌ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టైప్ రైటింగ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు తమకు కేటాయించిన సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకుని పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని బి. కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు

# అమాత్య..భాగ్యమెప్పుడు...

హైదరాబాద్, జూలై 16, సినిమాల్లో లేడీ అమితాబ్‌గా, రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్‌గా పేరొందిన విజయశాంతి శైలి ఎప్పుడూ విలక్షణమే. ఏ పార్టీలో ఉన్నా తనదైన ముద్ర వేయాలనుకునే ఆమె, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సొంత ప్రభుత్వంపైనే విమర్శల బాణాలు ఎక్కుపెట్టడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాజాగా షాబాద్ మర్డర్ల కేసులో పోలీసుల తీరును, రాష్ట్ర ప్రభుత్వ స్పందనను ఆమె బహిరంగంగా తప్పుబట్టడం హస్తం పార్టీని తీవ్ర ఇరకాటంలోకి నెట్టింది. అయితే, ఈ విమర్శల వెనుక శాంతిభద్రతల పరిరక్షణ కంటే, ఆమె వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయనే విమర్శలు స్వపక్షం నుంచే బలంగా వినిపిస్తున్నాయి. విజయశాంతికి ఉన్న మాస్ ఇమేజ్, కరిష్మాను చూసి అన్ని రాజకీయ పార్టీలూ ఆమెను సాదరంగా ఆహ్వానిస్తూ ఉంటాయనేది బహిరంగ రహస్యం. కానీ, ఆమె ట్రాక్ రికార్డును పరిశీలిస్తే క్షేత్రస్థాయి రాజకీయాలకు ఆమె చాలా కాలంగా దూరంగా ఉంటున్నారనే వాస్తవం స్పష్టమవుతుంది. ప్రజల పక్షాన నిలబడి రోడ్లపైకి వచ్చి పోరాడిన దాఖలాలు, లేదా పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించిన సందర్భాలు ఇటీవలి కాలంలో ఎక్కడా కనిపించలేదు. కేవలం సోషల్ మీడియా వేదికగా అడపాదడపా పోస్టులు పెట్టడానికే ఆమె పరిమితమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఆ పోస్టులు సైతం పార్టీకి మైలేజ్ తెచ్చేలా కాకుండా, ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేసేలా ఉండటం గమనార్హం. కేవలం సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమించకుండా పదవులు ఆశించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు సొంత పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాల వెనుక విజయశాంతి సుదీర్ఘ నిరీక్షణ, అసంతృప్తి దాగి ఉన్నాయని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనకు మంత్రి పదవి దక్కాలని ఆమె ఎంతో కాలంగా గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# ఆగష్టు 10న జైల్ భరో ను జయప్రదం చేయండి...

**పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలి,**

**కొత్త విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలి**

**రైతు సంగం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 16(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, స్వామినాధన్ సిఫార్సులు అమలు చేయాలని రైతు సంగం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు అన్నారు, రైతు సంగం ఆధ్వర్యంలో సుందరయ్య భవన్లో జరిగిన కార్యక్రమంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన లేబర్ కొడ్స్ ను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీబి గ్రామ్ జి చట్టని రద్దు చేసి మహాత్మా గాంధీ పాత చట్టాన్ని అమలు చేయాలనీ అన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అన్నారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన విద్యుత్ రద్దు చేయాలనీ అన్నారు. రైతులు, కార్మికులు, కూలి లకు వ్యతిరేకం గా తెస్తున్న విధానాలకు వ్యతిరేకంగాలిఆగష్టు 10న జైల్ భరో ను జయప్రదం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమం లో రైతులు, కార్మికులు, కూలి లుపెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో రైతు సంగం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు యన్ శ్రీనివాస్, నాయకులు యాదగౌడ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు




# తేనెటీగల పెంపకంతో మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి

**"మా శక్తి" బ్రాండ్‌తో ములుగు తేనెకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి**

**రుణ సదుపాయాలతో మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలి**

**మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 16** గురువారం తాడ్వాయి మండలం గొనెపల్లి గ్రామంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా హంబుల్ బీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సమ్మక్క--సారక్క మండల సమాఖ్య పరిధిలోని వెలుగురేఖ గ్రామ సంఘం మహిళలకు శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.






ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ తేనె ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సహజ ఔషధమని, మార్కెట్‌లో దీనికి ఎల్లప్పుడూ మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు. మహిళలు చిన్న చిన్న సీసాల్లో ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, నాణ్యమైన బ్రాండింగ్‌తో తేనెను విక్రయిస్తూ మంచి లాభాలు సాధించాలని సూచించారు.

ములుగు జిల్లాకు ప్రభుత్వం అందించిన "మా శక్తి" బ్రాండ్ పేరుతో "ఆదివాసి తేనె", "అడవి తేనె", "సమ్మక్క--సారక్క తేనె" వంటి స్థానిక గుర్తింపుతో మార్కెటింగ్ చేస్తే నాణ్యమైన అటవీ తేనెకు ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు వినియోగదారుల్లో విశ్వాసం పెరిగి రాష్ట్రవ్యాప్తంగా మంచి మార్కెట్‌ను సొంతం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రారంభంలో కొంత శ్రమ అనిపించినా, క్రమంగా తేనెటీగల పెంపకం సులభమైన, స్థిరమైన ఆదాయ వనరుగా మారుతుందని తెలిపారు.

మోదుగాకు, ఇప్పాకులతో తయారయ్యే విస్తారాకులకు ప్రస్తుతం మంచి మార్కెట్ ఉందని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా సహజ ఆకుల వినియోగం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. మోదుగు పూల నుంచి నాణ్యమైన తేనె లభిస్తుందని, ప్రకృతి ఆధారిత జీవన విధానాన్ని తిరిగి అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని బ్యాంకు లింకేజీ రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు ఈ రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.

ములుగు ప్రాంతంలో తేనె ఉత్పత్తికి అనుకూలమైన వాతావరణం ఉందని, ఇక్కడ ఉత్పత్తి చేసే నాణ్యమైన తేనెకు రాష్ట్రవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. గతంలో మహిళలకు విస్తారాకుల తయారీ ద్వారా ఉపాధి కల్పించినట్లే, ఇప్పుడు తేనెటీగల పెంపకం ద్వారా మరో కొత్త ఆదాయ అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

కొండపర్తిలో ఇప్పపువ్వుతో లడ్డూల తయారీ ప్రారంభించిన మహిళలు కొద్ది నెలల్లోనే లక్షల రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని ఉదాహరణగా పేర్కొంటూ, అదే స్ఫూర్తితో తేనెటీగల పెంపకాన్ని కూడా విజయవంతమైన జీవనోపాధిగా మలచుకోవాలని మహిళలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీ శాఖ అధికారి, అదనపు కలెక్టర్ ఎం. సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ప్రజాప్రతినిధులు, సెర్ప్ అధికారులు, హంబుల్ బీ సంస్థ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

### ప్రతి భక్తుడు ఒక మొక్కతో వచ్చి మొక్కు తీర్చుకోవాలి

### మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 16**గురువారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావుతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం ఆలయ అభివృద్ధి పనుల ప్రతిపాదనలను మ్యాప్ ద్వారా పరిశీలించి, సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క ఆలయ అభివృద్ధి పనులు ఆలయ క్షేత్ర విశిష్టత, చారిత్రక వైభవం, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా చేపట్టాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో కనిపించే నిర్మాణాలకు భిన్నంగా, మల్లూరు దేవస్థాన ప్రత్యేకతను ప్రతిబింబించే విధంగా డిజైన్లు రూపొందించాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు.

గోదావరి నది, చింతామణి జలధార, కొండలు, గుట్టలు, పురాతన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణలని పేర్కొన్నారు. ఇప్పటికే డబుల్ రోడ్డును అభివృద్ధి చేసినట్లు, రూ. 50 కోట్లతో రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

ఆలయ పరిసరాల్లో ఉన్న ఉపదేవాలయాల అభివృద్ధికి కూడా అంచనాలు సిద్ధం చేసి అందజేయాలని, రాబోయే పుష్కరాల నాటికి వాటి అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చూడాలన్నారు. దేవస్థానం వద్ద నిర్మించిన ఆడిటోరియాన్ని పురావస్తు శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర విశిష్టతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ క్షేత్రాన్ని సందర్శించాలనే ఆసక్తిని ముఖ్యమంత్రి వ్యక్తం చేశారని, భవిష్యత్తులో ముఖ్యమంత్రి పర్యటనలో ఈ దేవస్థానాన్ని సందర్శించే విధంగా చూస్తామన్నారు.

మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేయాలన్నారు. రాతి స్వరూపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి విగ్రహం, చుట్టూ ఉన్న కొండలు, గుట్టలు, చింతామణి జలధార వంటి ఈ క్షేత్ర ప్రత్యేకతలను భావితరాలకు అందేలా సంరక్షించాలని అన్నారు. సమ్మక్క--సారలమ్మ వనదేవతల మాదిరిగానే వనంలో, కొండల్లో కొలువైన లక్ష్మీనరసింహస్వామి మహిమను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

ఆలయ ప్రాంగణంలోని ప్రతి గోడ, ప్రతి రాతిపై పురాణాల్లోని ఆధ్యాత్మిక విశిష్టతను ప్రతిబింబించే కళాత్మక శిల్పాలు, రూపాలు ఉండేలా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆలయ ఈవోకు సూచించారు. సందర్శించే ప్రతి భక్తుడికి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా పరిసరాలను తీర్చిదిద్దాలన్నారు.

ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంపై అధికారులు నిరంతరం ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో కొంతసేపు ధ్యానం చేసుకునేలా ఎలాంటి దుర్వాసన, అసౌకర్యం లేకుండా ఆలయ పరిసరాలను నిర్వహించాలని సూచించారు.

ఆలయ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా పోలీసులు నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కొండ ప్రాంతమంతా పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రమనే భావనతో పరిరక్షించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ములుగు జిల్లాకు వచ్చే ప్రతి భక్తుడు, ప్రతి పర్యాటకుడు తప్పనిసరిగా ఒక మొక్కతో రావాలని మంత్రి పిలుపునిచ్చారు. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సమ్మక్క--సారలమ్మ వనదేవతలు, రామప్ప దేవాలయం, బొగత జలపాతం వంటి పర్యాటక, పుణ్యక్షేత్రాలను సందర్శించే ప్రతి ఒక్కరూ తమ మొక్కు తీర్చుకునే సందర్భంగా ఒక మొక్క నాటాలని కోరారు.

జామ, మామిడి వంటి పండ్ల మొక్కలను నాటడం ద్వారా అడవుల్లో నివసించే వన్యప్రాణులకు ఆహారం అందడంతో పాటు పచ్చదనం పరిరక్షించబడుతుందని తెలిపారు. అడవుల్లోని దేవస్థానాల పవిత్రతను కాపాడాలంటే అడవులు పరిశుభ్రంగా, పచ్చగా ఉండాలని, స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీటి వనరులను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు."ఒక మొక్కతో ములుగులోకి అడుగుపెట్టండి... ఒక మొక్కతో దేవుణ్ణి దర్శించుకోండి... ఒక మొక్కతో మీ కోరికలను కోరుకోండి..." అనే సందేశాన్ని ప్రతి భక్తుడు ఆచరణలో పెట్టాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్‌వో వికాస్ మీనా, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జీ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొండాయి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు

### ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 16**ఏటూరునాగారం: కొండాయి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు ఆందోళన వ్యక్తం చేశారు.

కొండాయి ఆశ్రమ పాఠశాలలో సుమారు 40--50 మంది విద్యార్థులు చదువుకుంటున్నప్పటికీ, ప్రస్తుతం ఒకే ఒక్క ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు బోధన నిర్వహించడం వల్ల విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్య అందడం లేదని, వారి విద్యాభవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నారు.

అదేవిధంగా పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యుత్, తరగతి గదుల నిర్వహణ, ప్రహరీ గోడ వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా తగినంతగా లేవని తెలిపారు. ఈ సమస్యల వల్ల విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో కొండాయి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులను తక్షణమే నియమించాలని, అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఏటూరునాగారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయంలో డీడీ జనార్ధన్ గారికి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా అధికారులు వెంటనే స్పందించి ఉపాధ్యాయుల కొరతను తీర్చడంతో పాటు పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తేజ, నవీన్ తదితరులు పాల్గొన్నారు

# వేములవాడ రాజన్న ఆలయ కళ్యాణకట్టలో ఈవో రమాదేవి ఆకస్మిక తనిఖీలు

### అదనంగా భక్తుల వద్ద డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు

**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై 16:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణకట్టలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి ఎల్. రమాదేవి గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల భక్తుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో ఆమె స్వయంగా కళ్యాణకట్టను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులతో నేరుగా మాట్లాడి వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకుని వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.



అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులు, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. తలనీలాల టికెట్ ధర రూ.50 మాత్రమేనని, భక్తుల నుంచి ఎలాంటి అదనపు డబ్బులు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే కాంట్రాక్టును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చుతామని హెచ్చరించారు. భక్తులకు అవగాహన కల్పించేందుకు కళ్యాణకట్టలో తలనీలాల టికెట్ ధర, అదనపు డబ్బులు చెల్లించవద్దనే సూచనలతో బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కళ్యాణకట్టలో సీసీ కెమెరాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి, ప్రత్యేక సిబ్బందితో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు పారదర్శకంగా, ఇబ్బందుల్లేని సేవలు అందించడమే దేవస్థానం లక్ష్యమని ఈవో రమాదేవి తెలిపారు. ఎవరైనా అదనపు డబ్బులు డిమాండ్ చేసినా లేదా వసూలు చేసినా వెంటనే దేవస్థానం అధికారులకు సమాచారం అందించాలని ఆమె భక్తులను కోరారు. వారితో దేవస్థానం డీఈవో నవీన్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, శివసాయి, ఏఈ రామకృష్ణారావు, స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు ఉద్యోగులు పాల్గొన్నారు.



### బీజేపీ ది హిందుత్వ ఎజెండ

### బిజెపి కి హిందువులు ముస్లిలు , క్రైస్తవులు అందరు సమానమే

### బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి



హైద్రాబాద్ జులై 16 ; బిజెపి కి హిందువులు ముస్లిలు , క్రైస్తవులు అందరు సమానమేనని దేశ భక్తి గల ముస్లింలను , క్రైస్తవులను బిజెపి పార్టీ హిందువులతో సమనామిగలనే బావిస్తుందని బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి అన్నారు పాకిస్టాన్, బంగ్లాదేశ్, బర్మా, మాయమ్మార్ రోహింగ్యాలను 2002 లో భారత్ లో తెచ్చి పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని దీనికి ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ లు శరణార్థుల పేరిట అడ్డాగా మార్చింది కాంగ్రెస్ అని ఈ విషయములను అందరూ తెలుసుకోవాలని అన్నారు, ఎంఐఎం, ఎం బి టి లు మతతత్వమును రేచ్చగొడుతున్నాయని తెలిపారు, వీటికి కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీ లు ఓటు బ్యాంకు ల, కోసం మద్దతు ఇస్తున్నాయని అన్నారు తక్షణమే కాంగ్రెస్, బి ఆర్ ఎస్ లు రోహింగ్యాలను తిరిగి పంపాలని బీజేపీ పోరాటానికి మద్దతు ఇవ్వాలని బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## విద్యుత్ సరఫరా సరిగా కావడం లేదని సబ్‌స్టేషన్ను ముట్టడించిన రైతులు

సూర్యాపేట మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామ సబ్‌స్టేషన్ వద్ద రైతులు ఆందోళన కు దిగారు. విద్యుత్ సరఫరా సరిగా కావడం లేదని సబ్‌స్టేషన్ను ముట్టడించారు. విద్యుత్ సరఫరా సరిగా కావడం లేదని, వేసిన పంటలు కరెంటు లేక ఎండిపోతున్నాయని మండిపడ్డారు. కోతలు లేని నాణ్యమైన కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేసారు.

## వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ ఎంపీతో సమావేశమైయారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఉభయ సభల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, ప్రస్తావించాల్సిన ప్రజా సమస్యలు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై జగన్ దిశానిర్దేశం చేసారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com